## గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

**ములుగు, ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సోమవారం ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన అన్నం, ఆలుగడ్డ, పప్పు, సాంబారు, గుడ్డు, పెరుగు, నెయ్యిలను పరిశీలించి కూర నాణ్యత మెరుగుపరచాలని, రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. రోజు భోజనం ఎలా పెడుతున్నారు, రుచిగా ఉంటుందా, మెనూ ప్రకారం వంట చేస్తున్నారా అని విద్యార్థులను అడగా బాగానే ఉందని కలెక్టర్‌కు తెలిపారు. అన్నం బాగా నమిలి తినాలని, మంచి క్రమశిక్షణ అలవాట్లు అలవర్చుకోవాలని తెలిపారు. రోజు కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, భోజనం చేసే ముందు విద్యార్థులచే ప్రార్థన గీతం ఆలపించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రోజు ఓపి ఎంత చూస్తున్నారు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అని ఆరాతీశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## సిఎం కప్ ఆర్చరీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సిఎం కప్ క్రీడాపోటీలలో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన ఆర్చరీలో సిహెచ్ రశ్మితారెడ్డి, పాతూరి హేమంత్‌రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో బాలుర విభాగంలో పాతూరి హేమంత్‌రెడ్డి, బాలికల విభాగంలో రశ్మితారెడ్డిలు అత్యధిక ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. ఇద్దరు ఈనెల 19 నుంచి ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కోచ్ డాక్టర్ రవిశంకర్ వీరిని అభినందించారు.



ఎంపికైన రశ్మితారెడ్డి, హేమంత్‌రెడ్డి



చైర్‌పర్సన్‌గా ముస్త్యాల అరుణ, వైస్ చైర్‌పర్సన్ మేడిశెట్టి ఉమా

## చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ముస్త్యాల అరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా మేడిశెట్టి ఉమ ఎన్నిక

### బిఆర్ఎస్ చైర్‌పర్సన్‌కు ఓటింగ్ వేసిన కాంగ్రెస్ కౌన్సిలర్

**చేర్యాల, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త :** చేర్యాల మున్సిపాలిటీ కుర్చీని బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. సోమవారం పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎంపికతో పాటు కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్‌పర్సన్‌గా 6వ వార్డు నుంచి గెలుపొందిన ముస్త్యాల అరుణ, వైస్ చైర్‌పర్సన్‌గా 10వ వార్డులో గెలుపొందిన మేడిశెట్టి ఉమాలు ఎన్నికయ్యారు. అయితే మున్సిపాలిటిలో 12 వార్డుల్లో 7 స్థానాలు బిఆర్ఎస్, కాంగ్రెస్ 5 స్థానాల్లో గెలుపొందగా బిఆర్ఎస్‌నుంచి ముస్త్యాల అరుణకు చైర్‌పర్సన్‌గా ఏడుగురు మద్దతుగా చేతులెత్తగా కాంగ్రెస్ నుంచి మొదటి వార్డు కౌన్సిలర్ ఒగ్గు వెంకటమ్మ చేతులెత్తి మద్దతు తెలపడంతో పార్టీలో పెద్దఎత్తున చర్చనీయాంశనీయంగా మారింది.

## దుబ్బాక మున్సిపల్

### చైర్మన్‌గా శ్రీరాంసంగీత, వైస్‌చైర్మన్ ఆస సులోచన



మున్సిపల్ నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** దుబ్బాక మున్సిపల్ నూతన చైర్మన్‌గా బిఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రీరాం సంగీత, వైస్ చైర్మన్‌గా ఆస సులోచన ఎన్నికయ్యారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం ఆధ్వర్యంలో మున్సిపల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల 11 న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులను సోమవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ పి.సదానందం 20 మంది కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎక్స్ అఫీషియో హోదాలో హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రీరాం సంగీత ను చైర్మన్ గా ప్రతిపాదించారు. దుబ్బాక మున్సిపాలిటీలో లోని 20 వార్డులగాను బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించిన కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో హోదాలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలపి మొత్తం 15 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రీరాం సంగీతను చైర్మన్‌గా, ఆస సులోచన ను వైస్ చైర్మన్ గా ఎన్నుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సంగీత,వైస్ చైర్మన్ ఆస సులోచనలకు సిద్దిపేట జిల్లా ఆర్డీవో సదానందం సర్టిఫికెట్లను అందజేశారు.

## ఇస్నాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మోటె సుమలత

### వైస్ చైర్‌పర్సన్‌గా పట్లోళ్ల మాధవిరెడ్డి



చైర్‌పర్సన్ మోటే సుమలత

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని లక్టారం వార్డు కార్యాలయంలో సోమవారం ఇస్నాపూర్ పురపాలక సంఘం చైర్పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక అదికృత అధికారి పి.శ్రీకాంత్ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి నీలం కవిత ముదిరాజ్ కి 13 ఓట్లు, బీఆర్ఎస్ పార్టీ నుండి మోటే సుమలత కి 15 ఓట్లు వచ్చాయి. ఇందులో అధిక ఓట్లు వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మోటే సుమలత ఇస్నాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ గా అల్లంరెడ్డిగారి లక్ష్మికి 13 ఓట్లు, పట్లోళ్ల మాధవి రెడ్డికి 15 ఓట్లు రాగా పట్లోళ్ల మాధవి రెడ్డిని వైస్ చైర్ పర్సన్ గా ఎన్నుకున్నారు. చైర్ పర్సన్ మోటే సుమలత, వైస్ చైర్పర్సన్ పట్లోళ్ల మాధవి రెడ్డి లను పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా ఎక్స్ అఫీషియో ఓట్లను ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. ఇస్నాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ ఎన్నిక సందర్భంగా సైబరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆవాచనీయ సంఘటనలు జరగలేదు.

## సంగారెడ్డి మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం

### చైర్‌పర్సన్‌గా కూన వనిత, వైస్ చైర్మన్‌గా షేక్ షఫీ అహ్మద్

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** సంగారెడ్డి మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో రెండు పదవులు కాంగ్రెస్ అభ్యర్థులే చేపట్టారు. సోమవారం ఉదయం కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం పార్టీలకు ఎన్నికైన సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. ముందుగా వీరితో ఎన్నికల ప్రత్యేక అధికారి, జడ్పి సీఈవో జానకిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జరిగిన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన 23వ వార్డు సభ్యురాలు కూన వనిత చైర్‌పర్సన్‌గా ఎన్నికకాగా, వైస్ చైర్మన్‌గా 26వ వార్డు సభ్యుడు షేక్ షఫీఅహ్మద్ ఎన్నికయ్యారు అనంతరం వీరికి ఎన్నికల అధికారి జడ్పి సిఈఓ జానకిరెడ్డి ధృవపత్రలాను అందజేశారు. ప్రత్యేక సమావేశం సందర్భంగా కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి నాయకుల అభిమానులు మున్సిపల్ కార్యాలయానికి భారీ ఎత్తున చేరుకున్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు విజయోత్సవ భారీ ర్యాలీ నిర్వహించారు.



సంగారెడ్డి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కూన వనిత, షేక్ షఫీ అహ్మద్‌లు

## హుస్నాబాద్ మున్సిపాలిటీ

### చైర్‌పర్సన్‌గా లక్ష్మి, వైస్ చైర్మన్‌గా పద్మ ఏకగ్రీవ ఎన్నిక

#### ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. మొత్తం 20 వార్డులకుగాను కాంగ్రెస్ పార్టీకి చెందిన 16 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని సమావేశంలో పాల్గొన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కావడంతో మొత్తం 21 మంది సభ్యులు పాల్గొన్నారు. కౌన్సిలర్లతో కలిసి ప్రత్యేక అధికారి, ఆర్డీవో రామ్మూర్తి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు చైర్మన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ తరఫున 14వ వార్డు కౌన్సిలర్ దండి లక్ష్మి కొమురయ్య పేరును ఒక సభ్యుడు ప్రతిపాదించగా, మిగతా సభ్యులు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. దీంతో హుస్నాబాద్ మున్సిపాలిటీ చైర్మన్‌గా దండి లక్ష్మి ఎన్నికైనట్లు ఆర్డీవో రామ్మూర్తి అధికారికంగా ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ పదవికి 7వ వార్డు కౌన్సిలర్ చిత్తారి పద్మ పేరును ప్రతిపాదించగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అంతకు ముందు 1వ వార్డు చెన్నబోయిన అనూషవిద్యాసాగర్(కాంగ్రెస్), 2వ వార్డు బూరుగు లతకిష్టస్వామి(కాంగ్రెస్), 3వ వార్డు కొండ రజితసత్యనారాయణ(కాంగ్రెస్), 4వవార్డు పిల్లి తిరుపతి (కాంగ్రెస్), 5వ వార్డు బొలిశెట్టి రాజు(కాంగ్రెస్), 6వ వార్డు, భుక్య సంపత్ నాయక్(కాంగ్రెస్), 7వ వార్డు చిత్తారి పద్మరవీందర్(కాంగ్రెస్), 8వ వార్డు కేశవేణి సరిత సాంబరాజు(కాంగ్రెస్), 9వ వార్డు గడిపె సంపత్ (బిఆర్ఎస్), 10వ వార్డు సావుల మంజుల రామకృష్ణ(కాంగ్రెస్), 11వ వార్డు పూదరి వరప్రసాద్‌గౌడ్ (కాంగ్రెస్), 12వ వార్డు కేశవేణి రమేష్(కాంగ్రెస్), 13వ వార్డు బొల్లి శ్రీనివాస్(బిఆర్ఎస్), 14వ వార్డు దండి లక్ష్మీ కొమురయ్య(కాంగ్రెస్), 15వ వార్డు ఆకుల రజితవెంకన్న(కాంగ్రెస్), 16వ వార్డు వైద్యం కిరణ్ (కాంగ్రెస్), 17వ వార్డు గాదేపాక రవి (బిఆర్ఎస్),



ప్రమాణ స్వీకారం చేసి ధృవపత్రాలు తీసుకున్న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో మంత్రి పొన్నం ప్రభాకర్

18వ వార్డు వాల సుప్రజానవీన్‌రావు (బిఆర్ఎస్), 19వ వార్డు బత్తుల స్వరూప రవీందర్ (కాంగ్రెస్), 20వ వార్డు గోపగొని శోభన్(కాంగ్రెస్)లతో ఆర్డీవో రాంమూర్తి మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ తో కలిసి ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మతోపాటు పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. దండి లక్ష్మిని చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు. ఎన్నికల ముందు రాజకీయాలు సహజమని, ఎన్నికల తర్వాత రాజకీయాలకతీతంగా హుస్నాబాద్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

### హుస్నాబాద్ మున్సిపల్ విప్‌గా కేశవేని రమేష్

**హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** మున్సిపల్ విప్‌గా 12వ వార్డు కౌన్సిలర్ కేశవేని రమేష్ నియమితులయ్యారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పాలకవర్గం ప్రమాణ స్వీకార సమావేశంలో ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మున్సిపాలిటీ కార్యకలాపాల్లో సమన్వయం, క్రమశిక్షణను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. విప్‌గా రమేష్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో పార్టీ తరఫున కీలక పాత్ర పోషిస్తూ, కౌన్సిలర్ల మధ్య సమన్వయం సాధించడం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చురుకైన పాత్ర నిర్వహించడం తనకు అప్పగించిన బాధ్యతగా పేర్కొన్నారు.పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కేశవేని రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'పేట' మున్సిపాలిటీలో కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం

### చైర్‌పర్సన్‌గా అంజమ్మ, వైస్ చైర్‌పర్సన్‌గా రేణుక ఏకగ్రీవ ఎన్నిక

**సదాశివపేట, ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):** సదాశివపేట మున్సిపాలిటీలో సంవత్సరం తర్వాత సోమవారం ఉదయం కొత్త పాలకవర్గం ఏర్పాటైంది. సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి 16, బిజెపి నుంచి ఒకరు ఇండిపెండెంట్ నుంచి ఒకరు మొత్తం 18 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. టిఆర్ఎస్‌పార్టీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. చైర్మన్ వైస్ చైర్మన్ ఎంపిక ప్రక్రియ ముందుగా నిర్ణయించిన ప్రకారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు ఏర్పాటు చేశారు. చైర్మన్ వైస్ చైర్మన్ ఎంపిక కోసం ప్రత్యేకంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ రాజేందర్ తెలిపారు మున్సిపల్ చట్టం ప్రకారం కాంగ్రెస్ పార్టీ నుండి శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి విప్ జారీచేశారని, దీనిప్రకారం పార్టీ తరపున గెలిచిన సభ్యులు పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసినట్లయితే వారి సభ్యత్వాన్ని రద్దు చేయబడుతుందని తెలిపారు. ముందుగా సమావేశానికి వచ్చిన సభ్యులను లెక్కించారు. ఎక్స్ఆఫీషియో సభ్యునితో కలిపి మొత్తం 27 మంది సభ్యులు ఉండగా సమావేశానికి 18 మంది సభ్యులు హాజరయ్యారని చైర్మన్ ఎంపికకు కావలసిన కోరం ఉండడం వల్ల ఆ ప్రక్రియ ప్రారంభిస్తున్నారని ఆర్డీవో తెలిపారు. చైర్మన్ ఎంపిక కోసం 20వ వార్డు కౌన్సిలర్ అంజమ్మను 25వ



చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆర్డీఓ

వార్డు కౌన్సిలర్ కోవిరి శంకర్‌గౌడ్ ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ అరుణ్‌కుమార్ బలపరిచారు. చైర్మన్ పదవి కోసం ఒకే నామినేషన్ రావడంతో అంజమ్మ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీఓ రాజేందర్ ప్రకటించారు. తరువాత జరిగిన వైస్ చైర్మన్ ఎంపికకు మూడవ వార్డ్ కౌన్సిలర్ రేణుకను 17వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ సజీ ప్రతిపాదించగా రెండవ వార్డ్ కౌన్సిలర్ ఎరుకల నర్సింలు ఆ ప్రతిపాదనను బలపరిచారు. దీనికీ ఒకే నామినేషన్ రావడంతో వైస్‌చైర్మన్‌గా శ్రీమతి రేణుక ఎన్నికైనట్లు ఆర్డీవో రాజేంద్ర ప్రకటించారు. కౌన్సిలర్‌గా ప్రమాణం స్వీకారం చేసిన సభ్యులకు మునిసిపల్ కమిషనర్ శివాజీ, తహసీల్దార్ బాలరాజ్, ఆర్డీఓ రాజేందర్ పూలమాలలు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కులకర్ణి అలియాస్ రోహిత్‌శర్మ పాల్గొన్నారు.

## విద్యా పరిరక్షణ సంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 16, ప్రభావతవార్త:** సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం సంగారెడ్డి జిల్లా విద్యా పరిరక్షణ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్షీ మ్మనారాయణ, సహాధ్యక్షులు వై.అశోక్‌కుమార్ హాజర య్యారు. గౌరవ అధ్యక్షులుగా దండు అంజయ్య, జిల్లా అధ్యక్షులుగా యం. సోమశేఖర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా సంజీవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనుముల రాంచందర్, జిల్లా అసోసియేట్ ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షులుగా నాసర్ పటేల్, సందీప్, మల్లికార్జున పాటిల్, రాగులపల్లి లక్షీ మ్మ, గోవింద్ రెడ్డి, చంద్ర శేఖర్, విద్యాసాగర్, మానస జిల్లా కార్యదర్శులుగా బంగారు క్రిష్ణ, శ్రీధర్ మహేంద్ర, శ్రీశైలం, చంద్రారెడ్డి, సాయిలు చారి, రామ చంద్రయ్య, పోచయ్య, సుదర్శన్ గౌడ్, ప్రత్యేక ఆహ్వానితులుగా విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతన కమిటీ ఎన్నిక అనంతరం విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి, పాఠశాలల కుదింపును విరమించుకోవాలి, అన్ని స్థాయిల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

## అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్‌గా క్రిష్ణారెడ్డి

- * వైస్ చైర్మన్‌గా ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)
- * రెండు పదవులూ జోగిపేటకే
- * అందోలుకు మొండిచెయ్యి
- * మొదటిసారిగా మారిన సాంప్రదాయం

**జోగిపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్‌గా 20వ వార్డు నుంచి గెలుపొందిన సోమిరెడ్డిగారి క్రిష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీలో ఇరవై వార్డులకు 16 స్థానాలను దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీలో చైర్మన్ అభ్యర్థిని ముందుగానే ప్రకటించారు. క్రిష్ణారెడ్డి చైర్మన్ అభ్యర్థిగా అనుకుని ఎన్నికలకు వెళ్లి మెజార్టీ స్థానాలను గెలుచుకున్నారు. ఫలితాల అనంతరం సోమవారం చేపట్టిన చైర్మన్ ఎన్నిక విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్.క్రిష్ణారెడ్డినే అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా అందోలుకు చెందిన కౌన్సిలర్ తోట్ల రామక్రిష్ణ చైర్మన్ అభ్యర్థిగా ఎస్.క్రిష్ణారెడ్డి పేరును ప్రతిపాదించగా, జోగిపేటకు చెందిన కౌన్సిలర్ పట్లోల్ల రేఖ బలపరిచారు. దీనికి మిగతా సభ్యులంతా మద్దతు తెలపటం, ఇంకెవరి పేరు చైర్మన్ పదవికి పోటీ రాకపోవటంతో ఎన్నికల అధికారి అంబదాస్ రాజేశ్వర్ ఎస్.క్రిష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అయితే వైస్ చైర్మన్ అభ్యర్థి విషయంలో తీవ్ర ఉత్కంఠ ఏర్పడింది. మొదటినుంచి చైర్మన్ విషయంలో ఏ ఇబ్బందీ లేకుండగా, వైస్ చైర్మన్ విషయంలో తీవ్రంగా పోటీ పడ్డారు. అందోలుకు చెందిన నలుగురు కౌన్సిలర్లు తమకంటే తమకంటూ పోటీపడ్డారు. క్యాంపుకు వెళ్లినప్పటికీ అక్కడా వైస్‌చైర్మన్ విషయంలో స్పష్టత రాలేదు. ఈ పరిస్థితుల్లో ఎవరి ఊహలకందని విధంగా అధిష్ఠానం ఆదేశంమేరకు జోగిపేట 15వ వార్డు నుంచి గెలుపొందిన ఆకుల సత్యనారాయణ(చిట్టిబాబు) పేరును రెండో వార్డు కౌన్సిలర్ కొశికె రాజశేఖర్ ప్రతిపాదించగా, 16వ వార్డు కౌన్సిలర్ పట్లోల్ల శ్రీనివాస్ బలరిచారు. వైస్ చైర్మన్ పదవికి మరెవరూ పోటీ లేకపోవటంతో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణను ఎన్నికైనట్లు ప్రకటించారు. దీంతో ఒక్కసారిగా అందోలునుంచి గెలుపొందిన నలుగురు వార్డు కౌన్సిలర్లు అవాక్కయ్యారు. ఎవరి ఊహలకందని విధంగా రెండు పదవులూ జోగిపేటకే కట్టబెట్టడంతో అందోలుకు చెందిన నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అందోలు అంటే లెక్కలేదా? మేము వైస్ చైర్మన్ పదవికి పనికిరామా అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచీ వైస్ చైర్మన్ పదవి అందోలుకు ఇచ్చేవారు. కానీ మొదటిసారి అందోలుకు మొండిచేయి ఇచ్చినట్లయింది. మున్సిపాలిటీకి ఇది మూడో పాలకవర్గం కాగా, గత రెండు పర్యాయాలు వైస్‌చైర్మన్ పదవిని అందోలుకు చెందినవారికి ఇచ్చారు. మొదటిసారి రెండు పదవులు జోగిపేటకు దక్కటంతో పట్టణ ప్రజలు కొంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జోగిపేట పట్టణ అభివృద్ధి సమితి పేరిట సోషల్ మీడియాలో అందోలుకే అన్ని కార్యాలయాలు తరలించటం, ప్రతీ విషయంలో అందోలుకే ప్రాధాన్యత ఇస్తున్నారని, జోగిపేట ప్రాధాన్యత తగ్గిపోతుందంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్న జోగిపేట పట్టణ ప్రజలు, వైస్ చైర్మన్ పదవిని జోగిపేటకే ఇవ్వటంపై చాలా సంతోషంగా ఉన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ముగిసిన అనంతరం మున్సిపల్ కార్యాలయం బయట కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అందోలుకు తీరని అన్యాయం చేశారని, మీరు గెలిచినా లాభం లేదంటూ కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు అందోలు కౌన్సిలర్ల ముందర తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. మొత్తానికి అందోలు-జోగిపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విషయంలో తీవ్ర ఉత్కంఠత ఏర్పడినా, చివరికి ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేకుండా ఎన్నిక ప్రక్రియ ముగిసింది. అంతకుముందు కౌన్సిలర్లుగా గెలుపొందిన 20 మందితో ఎన్నికల అధికారి ప్రమాణం చేయించారు.



మున్సిపల్ చైర్మన్‌గా క్రిష్ణారెడ్డి, వైస్‌చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న ఆకుల సత్యనారాయణ



మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు వెళుతున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

## కాంగ్రెస్ కౌన్సిలర్ల గైర్హాజరు.. కరువైన కోరం

### చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్‌కు ఎన్నికైన కౌన్సిలర్లు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కాంగ్రెస్, స్వతంత్ర, ఎంఐఎం కౌన్సిలర్లు గైర్హాజరు కావడంతో కోరంలేక ఎన్నికలను మున్సిపల్ కమిషనర్ జైత్రంనాయక్ వాయిదా వేశారు. మున్సిపాలిటీలో 37 వార్డులు ఉండగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్ ఎక్స్ ఆఫీషియో సభ్యులతో మొతం 39 మందికిగాను సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి కేవలం 15 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు, ముగ్గురు బిజెపి కౌన్సిలర్లు, ఎమ్మెల్యే హాజరుకావడంతో సమావేశానికి 19 మంది హాజరయినట్లు అయింది. ఎమ్మెల్యే మానిక్‌రావు మధ్యాహ్నం 12 గంటలకు హైద్రాబాద్ లోని క్యాంప్ నుంచి బస్సులో కౌన్సిలర్‌లతో కలిసి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని సమావేశంలో పాల్గొన్నారు.మధ్యాహ్నం 1.30 గంటల వరకు కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో ఎన్నిక వాయిదా పడక తప్పలేదు.

**కొలిక్కి రాని చర్చలు...**

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక విషయంలో మ్యాజిక్ ఫిగర్ లేని కాంగ్రెస్ పార్టీకి ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్ల మద్దతు అవసరం కాగా క్యాంప్‌లో ఉండి చర్చలు జరుగుతున్నా ఒక కొలిక్కి రాకపోవడంతోనే కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదని తెలుస్తోంది. మున్సిపల్ కమిషనర్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను మంగళవారానికి వాయిదా వేశారు. డిఎస్‌పి సైదానాయక్ ఆధ్వర్యంలో సిఐ శివలింగం, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, కాశీనాథ్, రాజేందర్‌రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున బందోబస్తును నిర్వహించారు. ఇదిలాఉండగా సమావేశానికి కౌన్సిలర్‌లతోపాటు ఎమ్మెల్యేను మాత్రమే సమావేశ మందిరంలోకి అనుమతించారు.

## సమావేశం వాయిదా విచారకరం : ఎమ్మెల్యే

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు కోసం లేక(ఇద్దరు కౌన్సిలర్లు) వాయిదా పడటం విచారకరమని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. కోరం లేక ఎన్నికలను మున్సిపల్ కమిషనర్ వాయిదా వేయడంతో మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో కలసి ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ ఎన్నికకోసం కౌన్సిలర్‌లతో సమావేశానికి వచ్చామని, కోరంలేక వాయిదా పడటంతో తనతోపాటు కౌన్సిలర్లు అసౌకర్యానికి గురయ్యామన్నారు. బిఆర్ఎస్ పార్టీ సైతం చైర్మన్, వైస్ చైర్మన్ రేసులో ఉన్నారని, ఇంకా తమ పార్టీ నుంచి చర్మన్, వైస్ చైర్మన్‌ల పేర్లను ప్రకటించలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటిస్తామన్నారు. సమావేశం అనంతరం బిఆర్ఎస్, బిజెపి కౌన్సిలర్లతో ఎమ్మెల్యే మాణిక్‌రావు హైద్రాబాద్‌లోని క్యాంప్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో వెళ్లిపోయారు.

## ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తా : కౌన్సిలర్

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 16(ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపా లిటీ పరిధిలోని 20వ వార్డులో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కరిస్తానని స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థిగా నూతనంగా ఎన్నికైన అత్తెల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం వారు మాట్లాడుతూ తనను నమ్మి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో 20వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు.



కౌన్సిలర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న అత్తెల్లి శ్రీనివాస్

## మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలుశిక్ష

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి ఒకరోజు జైలుశిక్ష విధించడంతోపాటు మరొకరికి రూ.10 వేల జరిమానా విధించడం జరిగిందని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. కొన్ని రోజుల క్రితం గజ్వేల్‌లోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురిని సోమవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ చేసి జరిమానా, జైలు శిక్ష విధించడం జరిగిందని తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.15వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎస్ఐకి గాయాలు

**చౌటకూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటలో జోగిపేట ఎస్ఐ పాండుగౌడ్ గాయాలకు గురైన సంఘటన మండల పరిధిలోని సరాఫ్‌పల్లి వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్ఐ పాండుగౌడ్ సిబ్బందితో కలసి జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జోగిపేట నుంచి గుర్తు తెలియని వాహనం వేగంగావచ్చి పోలీసు వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఎస్ఐ పాండుగౌడ్ తలకు, నడుము భాగంలో బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌హెచ్‌ఏఐ అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఎస్ఐ పాండుగౌడ్‌ను చికిత్స నిమిత్తం సంగారెడ్డిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో పోలీసు వాహనం నుజ్జునుజ్జయింది. పోలీసు వాహనాన్ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం కోసం జాతీయ రహదారిపై అమర్చిన సిసి కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పుల్కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ఎస్ఐ పాండుగౌడ్, నుజ్జునుజ్జయిన పోలీసు వాహనం



రుద్రేశ్వరాలయంలో ఘటాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

## ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**కొండపాక, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** మండల కేంద్రలోని రుద్రేశ్వ రాలయంలో రెండు రోజులుగా సాగిన శివరాత్రి వార్షిక బ్రహోత్స వాలు సోమవారం మహా అన్నదానంతో ముగిసాయి. ఉత్స వాల్లో భాగంగా అది వారం రాత్రి శివపార్వతుల కళ్యాణోత్స వం కనుల పండువగా జరిగింది. కళ్యాణోత్స వాన్ని తిలకించడానికి వచ్చిన భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. సోమవారం సహస్ర ఘటలకు పూజలు నిర్వ హించి శివపార్వతులకు అభిషేకంచేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అలయ ట్రస్ట్ చైర్మన్ అనంతుల శ్యాంమోహన్, కార్యదర్శి వెంకటరమణశర్మ, రేణికింది బాలయ్య, కనక రాములు పాల్గొన్నారు. అదే విధంగా మర్పడ్గలోని శ్రీ సంతాన మల్లికార్జున స్వామి దేవాలయంలోనూ శివరాత్రి బ్రహోత్స వాలు ఘనంగా ముగిశాయి. క్షేత్ర నిర్వహకులు రాత్రి శివపార్వతుల కళ్యాణోత్స వం ఘనంగా నిర్వహిం చారు. దేవాలయంలో పెద్దపట్నం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణహుతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలతో బ్రహోత్స వాలు ముగిశాయి.

## విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



విద్యార్థులకు ప్రత్యేక క్లాస్‌లు నిర్వహిస్తున్న దృశ్యం

**కొండపాక, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని 10వ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకొవాడానికి కృషి చేయాలని సర్పంచ్ శిల్ప నర్సింలు, ఉప సర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం వారు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు ఫైనల్ పరీక్షల్లో మెరుగైనా పలితాలు సాధించి ఉన్నత చదువులకు వెళ్లాడానికి పాలక వర్గంతో కలిసి సాయంత్రం ప్రత్యేక క్లాస్‌లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్షల్లో ఎలాంటి భయందోళనకు గురికాకుండా ఉండాడానికి ఇప్పటి నుండి శ్రద్దగా చదువుకొవాలని వారు సూచించారు. విద్యార్థులు చదువులో పురోగతి సాధించడానికి తమ వంతు గా కృషి చేస్తున్నామని తెలిపారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి ఈ క్లాస్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంటి వద్ద సాయంత్ర సమయం వృథాకాకుండా చూడడమే తమ ఉద్దేశమన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లి తల్లిదండ్రులకు ఉన్న ఊరికి మంచి పేరు తేవాలని వారు కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చిరబోయిన సాయిలు, వంకని రాజు, దేవి నర్సింలు, గట్టు చంద్రం, పల్లిపాటి యాదవ్వ, కాన్గుల కళా కర్ణాకర్, రచకొం లావణ్య బిక్షపతి, చింతల ప్రవీణ్, చిక్కుడు ప్రమీల శ్రీనివాస్, వాలంటీర్ పల్లిపాటి రాజు పాల్గొన్నారు.

## పులి సంచారం.. అప్రమత్తంగా ఉండాలి : సిఐ

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చౌదా రం, బెజ్జంకి మండలం గుండారం గుట్టల పరిసర ప్రాంతాల్లో పులి సంచరి స్తున్నట్లు సమాచారం అందడంతో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్న కోడూరు ఎస్ఐ చంద్రమోహన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆటవీశాఖ అధికారులు,పూణే నుంచి వచ్చిన ప్రత్యేక రెస్క్యూ టీమ్ సభ్యులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. పులి కదలికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా చౌదారం, గుండారం వైపు నుంచి అటవీ ప్రాంతంలోకి వెళ్లే రెండు ప్రధాన మార్గాలను మూసి వేశారు. సామాన్య ప్రజలు, గొర్రెల కాపరులు అడవిలోకి వెళ్లకూడదని సీఐ శ్రీను తెలియజేశారు. శుక్రవారం దూడను చెట్టుకు కట్టేసిన ప్రాంతంలో పులి సంచరించినట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం రెస్క్యూ టీం పులిని పట్టుకునే ప్రయత్నాల్లో ఉందని, ప్రజలు ఒంటరిగా అటవీ ప్రాంతాలకు లేదా పొలాలకు వెళ్లవద్దన్నారు. చౌదారం, విఠలాపూర్, గంగాపూర్, మాచా పూర్, కిష్టాపూర్, మల్లారం, అనంతసాగర్, రంగాయిపల్లి, ఎల్లాయిపల్లి, కమ్మర్లపల్లి, మైలారం, అల్లీపూర్, గుండారం గ్రామాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సిఐ కోరారు. వన్యప్రాణి సంరక్షణ ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ పోలీసు, అటవీశాఖ అధికారులకు సహకరించాలన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అల్లాదుర్గంలోని శివాలయం, భక్త మార్కండేయ, శ్రీ రేణుక ఎల్లమ్మ, వీరభద్ర, కేశనాథ స్వామి, బేతాళ స్వామి, వెంకటేశ్వర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రిని పురస్కరించు కుని ఉపావాసం ఉన్న భక్తులు సాయంత్రం ఆలయాలకు చేరుకుని ఆలయంలో ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉపవాస దీక్షను విరమించారు.

## చైర్మన్ గిరి కొలిక్కి రాకనే కాంగ్రెస్ కౌన్సిలర్ల డుమ్మా

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల ఎంపికకు సోమవారం నిర్వహించిన సమావే శానికి కాంగ్రెస్ కౌన్సిలర్లతో పాటు స్వతంత్ర, ఎంఐఎం కౌన్సిలర్లు డుమ్మా కొట్టడంతో ఎన్నికల మంగళవారానికి వాయిదాపడింది. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికకు అటు బిఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీలకు మ్యాజిక్ ఫిగర్ లేక ఆయా పార్టీలు బిజెపి, ఎంఐఎం, స్వతంత్ర అభ్యర్థుల మద్దతు కోసం క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు ఇతర కౌన్సిలర్ల నుంచి మద్దతు లేకపోవడంతో చైర్మన్ గిరి కొలిక్కి రాకపోవడంతో కాంగ్రెస్, ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్లు సోమవారం జరగాల్సి న ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఎన్నికల మంగళవారానికి వాయిదా వేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లతో పాటు స్వతంత్ర కౌన్సిలర్‌గా విజయం సాధించిన కౌన్సిలర్లు చైర్మన్ పదవి కోసం పట్టు వీడకపోవడం, హైద్రాబాద్‌లోని క్యాంప్ నుంచి జహీరాబాద్‌కు వస్తున్న తరుణంలో మార్గ మధ్యలో చైర్మన్ గొడవ పెద్దదవడంతో చేసేదేమిలేక కాంగ్రెస్ కౌన్సిలర్లు సమావేశానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. 18వ వార్డు కౌన్సిలర్ గునేల్లి కవితకు రెండున్నర సంవత్సరాలు, 34వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ జాఫర్ తనకే మొదటి రెండున్నర సంవత్సరాలు చైర్మన్‌గిరి అప్పగించి తదుపరి రెండున్నర సంవత్సరాలు ఇతరుకు అప్పగిస్తానని అంటుండగా 17వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికైన జాంగిర్ తను మూడు మార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయినట్లు, తనకే చైర్మన్ పదవి కేటాయించాలని కాంగ్రెస్ నేతలకు సూచించనట్లు తెలుస్తోంది. చైర్మన్ పదవిపై సోమవారం రాత్రి కౌన్సిలర్లు ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నట్లు సమాచారం. వైస్ చైర్మన్‌గా 16వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ కొత్తకాపు శిరీషకు ఇవ్వనున్నట్లు తెలిసింది. చైర్మన్ పదవి ఎన్నిక ఉత్కంఠతకు తెరదించేందుకు కాంగ్రెస్ అధిష్టానం జోక్యం చేసుకోవాల్సి న అవసరం ఉందని కౌన్సిలర్లు అభిప్రాయపడుతున్నారు.

## వైభవోపేతంగా కాశీనాథ్ ఆలయ బ్రహ్మోత్సవాలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ పట్టణంలోని చారిత్రాత్మకమైన కాశీనాథ్ బ్రహ్మోత్స వాలు రెండురోజులపాటు అంగరంగవైభవంగా జరిగాయి. కార్యక్రమంలోభాగంగా మొదటిరోజు శేషవాహనసేవ, రెండవరోజు నందివాహనసేవలో పార్వతీ పరమేశ్వర విగ్రహాల ఊరేగింపు కన్నులపండుగగా జరిగింది. పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు జరగడంతో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొ న్నారు. శివరాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణం, లింగోద్భవ కార్యక్రమాలతో కాశీనాథ్ మందిరం శివనామస్మరణతో మార్మోగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ గురురాజుశర్మ, శిష్యబృందం ఆధ్వర్యంలో కార్య క్రమాల్ని ఆలయకమిటీ బాధ్యులు, సభ్యులు, భక్తులు, గురుస్వాముల, శివ స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమా హారతితోపాటు, ప్రముఖులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం

**-తీవ్ర ఉత్కంఠతల మధ్యన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక**
**-మున్సిపల్ చైర్మన్‌గా మాచునూరి లక్ష్మీరాజుయాదవ్**
**-వైస్ చైర్మన్‌గా వనముల బుచ్చేష్‌యాదవ్**



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా, ఉత్కంఠతల మధ్యన జరిగింది. మున్సిపల్ చైర్మన్‌పీఠం ఏపార్టీ దక్కించుకుంటుం దోనని పలువురు ఆసక్తిగా ఎదురుచూశారు. ఇటీ వల జరిగిన నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు 6మంది గెలుపొందగా, టిఆర్ఎస్ 5మంది కౌన్సిలర్ అభ్య ర్థులు ఎన్నికకాగా, బిజెపి అభ్యర్థులు 4గురు మా త్రమే కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఈమేరకు ఏ పార్టీకీ చైర్మన్‌పదవి పొందడానికి మెజార్టీ లేనం దున అందరూ అయోమయపరిస్థితిలో ఉన్నారు. ప్రధానపార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్‌లు క్యాంపులో ఉన్నారు. ఎన్నికల అధికారుల సూచన ల మేరకు సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుండగా కౌన్సిలర్‌గా గెలిచిన అన్ని పార్టీల కౌన్సిలర్ అభ్యర్థులు మొదటగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి బిజెపి పార్టీ నాయకులతో మంతనాలు జరిపినట్లు తెలి సింది. అయితే బిజెపి నాయకులతో జరిపిన చర్చ లు విఫలమయ్యాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బిజెపి నాయకులతో చర్చలు జరిపి ఒక కొలిక్కివచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరపున 6మంది కౌన్సిలర్ గెలిచినందున వారికి చైర్మన్ పదవి, బిజెపి పార్టీ తరపున గెలిచిన 4 గురు కౌన్సిలర్స్‌లో వైస్‌చైర్మన్ పదవి తీసుకోవడా నికి అంగీకరించారు. అనంతరం వారు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరపున 5వవార్డు నుంచి గెలుపొం దిన మాచునూరి లక్ష్మీరాజుయాదవ్‌ను చైర్మన్‌గా ప్రతిపాదించారు. ఇందుకు పదిమంది కౌన్సిలర్లు లక్ష్మీరాజుయాదవ్‌కు మద్దతు పలికారు. మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ చైర్మన్‌గా ఎన్నికైనట్లు అదే విధంగా వైస్‌చైర్మన్ పదవికి బిజెపి నుంచి గెలిచిన 13వవార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్‌ను వైస్‌చైర్మన్ గా ప్రతిపాదించగా 15వ వార్డు బిఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన పంబల్ల లలిత వైస్ చైర్మన్ పదవి కోసం పోటీలో ఉన్నారు. వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక జరపగా బిజెపి కౌన్సిలర్ బుచ్చేష్ యాదవ్ కు 10మంది కౌన్సిలర్లు మద్దతుపలకగా బిఆర్ఎస్ అభ్యర్థి పంబల్ల లలితాబిక్షపతికి కేవలం 6మంది మాత్రమే మద్దతుపలికారు. ఎన్నికల అధికారి మెదక్ ఆర్డిఓ రమాదేవి మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు ఓటింగ్ ప్రక్రియను పరిశీలించి మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా బిజెపి కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్‌ను వైస్‌చైర్మన్‌గా ప్రకటించారు. మాచునూరి లక్ష్మీరాజుయాదవ్‌ను చై ర్మన్ పీఠంలో కూర్చోబెట్టగా మున్సిపల్ వైస్‌చైర్మన్ గా బుచ్చేష్‌యాదవ్‌ను ప్రకటించారు. ఈ మేరకు నర్సాపూర్‌లో మున్సిపల్‌నచైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక ప్రశాంతంగా సాగింది. ఈ ఎన్నికలప్రక్రియ ను జిల్లా అదనపు ఎస్పీ మహేందర్‌రెడ్డి పరిశీ లించారు. ఈసందర్భంగా ఎలాంటి సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు నిర్వహించాలని ఆయన పోలీస్‌సిబ్బందికి సూచించారు. సిఐ జాన్ రెడ్డి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డిల అధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

**కాంగ్రెస్ పార్టీ సంబరాలు...**

కాంగ్రెస్‌పార్టీకి చెందిన 5వవార్డు కౌన్సిలర్ లక్ష్మీ రాజుయాదవ్ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన చైర్మన్, కౌన్సిలర్లతో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకు లు హుషారుగా డిజె సౌండ్ల బాజాభజంత్రీల మధ్య టపాసులు పేల్చుతూ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ నియో జకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు అంజనేయులుగౌడ్, నూతన కౌన్సిలర్లు నరసమ్మ, సుధీర్‌గౌడ్, సరళఆంజనేయులుగౌడ్, ఆఫ్రిన్ జరీనాబేగం, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, మండల అధ్యక్షులు మల్లేషం, రుస్తుంపేట అశోక్, రిజ్వాన్, వెంకట్రాంరెడ్డి, దావూద్, రశీద్, ఆంజనేయులు గౌడ్, అశోక్‌గౌడ్, మణిదీప్, ఉదయ్‌కుమార్, మా చునూరు సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ పీఠంపై నగేష్ షెట్కార్

**-నగేష్‌కుమార్ షెట్కార్ చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న సబ్‌కలెక్టర్**



చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న నగేష్ షెట్కార్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ పట్టణ మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ నుండి 8వ వార్డులో కౌన్సిలర్‌గా పోటీచేసిన నగేష్‌కుమార్ షెట్కార్‌తో ప్రమాణస్వీకారం సబ్‌కలెక్టర్ ఉమాహారతి మున్సిపల్ కార్యాలయంలో చేయించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 11మంది కౌన్సిలర్లు గెలుపొందగా వారిలో ఒకరు నగేష్ కుమార్ షెట్కార్ ఎనిమిదవ నుండి భారీ మెజార్టీతో గెలిచారు. కాంగ్రెస్‌పార్టీ తరపున నగేష్‌కుమార్ షెట్కార్‌ను చైర్మన్‌గా మున్సిపల్ కమిషనర్ కార్యా లయంలో సబ్‌కలెక్టరుకు 11మందిలో ఇద్దరు ప్రతిపాదించగా ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు. దీంతోపాటు వైస్‌చైర్మన్‌గా కూడా దారం శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో 11మంది కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. మున్సిపల్‌చైర్మన్ ఎన్నిక కార్య క్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కూర్చొని పూజాకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సి పల్ చైర్మన్ సతీమణి వారి అల్లుడు పిసిసి సభ్యులు శ్రీనివాసులు, ఇద్దరు కూతుర్లు, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు.

## ఏలేటి రాజశేఖర్‌రెడ్డికి లయన్ మెల్విన్ జోన్స్ ఫెలోషిప్

**రామాయంపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు లయన్ మెల్విన్ జోన్స్ పేరిట నెలకొల్పిన అత్యంత ప్రతిష్టాకరమైన మెల్విన్ జోన్స్ ఫెలోషిప్‌ను తనకు అందజేసినట్లు రామాయంపేటకు చెందిన క్లబ్ చార్టర్ సభ్యుడు లయన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ డైరెక్టర్ లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు, క్లబ్ మాజీ అధ్యక్షులు లయన్ టి.శేషాచారి, లయన్ దేమే యాదగిరిలతో పాటు జిల్లాలోని వివిధ క్లబ్బుల ముఖ్య లయన్స్ నాయకులు పాల్గొని రాజశేఖర్ రెడ్డిని అభినందించారు.

## ఖేడ్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ

**-పాల్గొన్న ఎమ్మెల్యే, నూతన చైర్మన్, కౌన్సిలర్లు**



ఖేడ్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తల దృశ్యం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్‌గా నగేష్ కుమార్ షెట్కార్, వైస్ చైర్మన్‌గా దారం శంకర్ ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు కౌన్సిలర్లు అందరితో సబ్‌కలెక్టర్ ఉమాహారతి ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్‌చైర్మన్ ఎన్నిక తర్వాత మున్సిపల్ ముందు నుండి ఓపెన్ టాప్ జీప్‌పై ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, మొత్తం కౌన్సిలర్లు నిలుచుండి ఆటపాటలతో బాజాభజంత్రీలతో డాన్సులు చేసుకుంటూ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ ర్యాలీ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయం నుండి ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకోగానే అక్కడ గజమాలతో ఎమ్మెల్యేను, మున్సిపల్‌చైర్మన్‌ను కాంగ్రెస్‌కార్యకర్తలు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే అక్కడినుండి వెళ్లిపోయారు. మున్సిపల్‌చైర్మన్‌తోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు అందరూ ఓపెన్ టాప్ జీప్‌పై కూర్చుని ర్యాలీ ప్రారంభించారు. ప్రతి వార్డులోనూ గెలిచినవార్డు కౌన్సిలర్లు పటాకులు కాలుస్తూ సంతోషంగా డాన్సులు చేశారు. ర్యాలీలో అనేకమంది కాంగ్రెస్‌పార్టీ అభిమానులు వ్యాపా రస్థులు నగేష్‌కుమార్‌ను, కౌన్సిలర్లను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలందరికీ ఎంపి సురేష్‌కుమార్ నివాసం వద్ద భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. ర్యాలీలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు, అందరికీ మనస్ఫూర్తిగా నమస్కారాలు ధన్యవా దాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా సేవాలాల్ జయంతి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

లంబాడి గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్‌మహరాజ్ 287 జయంతిని మండలపరిధి కామారంతండా, గోప్యతండాలో సేవాలాల్ జయంతి వేడుకలను స్వామినాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ప్రజలు గ్రామంలో నృత్యాలుచేస్తూ, బంజారాపాటలతో పెద్ద ర్యాలీ నిర్వహించారు.

# జనారణ్యంగా మారిన ఏడుపాయలవనం

**-రెండవరోజు ఘనంగా బండ్ల ఊరేగింపు..**
**-శివమెత్తిన శివసత్తులు**



విద్యుత్ దీపాల అలంకరణలో అమ్మవారి ఏడుపాయల క్షేత్రం

**పాపన్నపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఏడుపాయలవనం జనారణ్యంగా మారింది. జాత రలో ముఖ్యఘట్టమైన బండ్ల ఊరేగింపు ఘనంగా కొనసాగింది. ఊరేగింపును తిలకించేందుకు రాష్ట్ర ప్రజలే కాక, ఇతరరాష్ట్రాలు, చుట్టుప్రక్కల ప్రాంతా ల ప్రజలు లక్షలాదిగా తరలివచ్చారు. జానపదుల సంస్కృతికి అద్దంపట్టేవిధంగా రెండవరోజైన సోమ వారం బోనాల ఊరేగింపుతో జోరు కొనసాగింది. శివసత్తుల పునకాలు, పోతురాజుల గజ్జెలతో దద్ద రిల్లిపోయింది. పోతిరెడ్డిపల్లి చౌరస్తాగుండా చీమల దండును తలపించేవిధంగా భక్తులు లక్షలాది సంఖ్యలో తరలివచ్చారు. ప్రభుత్వం తగిన మౌలిక సదుపాయాలను భక్తులు వినియోగించుకొని దుర్గా మాతను దర్శించుకుంటున్నారు.

**బోనాలతో నృత్యాలు..**

దుర్గమ్మనామస్మరణతో జాతర హోరెత్తింది. మెరు పు కాగితాలతో అలంకరించిన బండ్లపై శివసత్తులు శివాలూగుతుండగా, గంటలతో జోడెడ్ల బండ్లు తిరుగుడు కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటుచేశారు. జాతర లో సోమవారం ఉదయం 5గంటల నుండి ప్రత్యేక పూజలు చేసి దుర్గమ్మ దర్శనాన్ని ప్రారంభించారు. గంటగంటకు భక్తులసంఖ్య పెరుగుతుండడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల నినాదాలతో ఏడుపాయల ప్రతిధ్వనించింది.

జాతరలోనే అత్యంత ప్రధాన ఘట్టమైన బండ్ల ఊరేగింపు సోమవారం అంగరంగవైభవంగా జరి గింది. ఆచారంప్రకారం పాపన్నపేట సంస్థానా ధీశుల బండికి ఆలయ అధికారులు స్వాగతం పలు కగా, బండిముందు డప్పుచప్పుళ్లకు అనుగుణంగా వందలాదిమంది యువకులు చిందులు వేసారు. సంస్థానాధీశుల బండి వెనక సుమారు 110బండ్ల ఊరేగింపు కొనసాగింది. మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో బండ్ల ఊరేగింపును అనుక్షణం పర్యవేక్షించారు.

సంస్థానాధీశుల బండికి గ్రామప్రజలు ఊరేగింపు నిర్వహించి గ్రామ పొలిమేర వరకు భారీసంఖ్యలో ప్రజలు తరలివచ్చి బండిని ఎంతో ఆదరణగా ఏడు పాయలకు సాగనంపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శెట్టి శ్రీకాంత్, ఎంపిటిసి ఆకుల శ్రీని వాస్, సర్పంచి పావనినరేందర్‌గౌడ్, ఉపసర్పంచి సద్దాం హుసేన్, వార్డుసభ్యులు రాజు, మాజీ సర్పంచి గురుమూర్తిగౌడ్, మాజీ ఉపసర్పంచి నాయకులు కిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సుంకరి కిష్టయ్య, భూమాగౌడ్, రవీందర్ గౌడ్, రవి తదితరులు ఉన్నారు.

**భారీ పోలీసు బందోబస్తు..**

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గతంలో ఎన్నడూలేనివిధంగా 1000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు. మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డిఎస్పీ సైతం జాతర భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

**నేడు రథోత్సవం..**

జాతరలో చివరి ఘట్టమైన రథోత్సవం కార్యక్రమం మంగళవారం జరుగనుంది. అందంగా వివిధరకాల పూలతో లైట్లను అలంకరించి రథోత్స వం మంగళవారంరాత్రి కొనసాగమంది. రథం గోలి నుండి అమ్మవారి ఆలయంవరకు కొనసాగనుంది. జాతరలో పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన కళాప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కళాకారులందరినీ ఆలయ ఈఓ వీరేశం శాలువాతో సత్కరించారు.

## ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారు.

**యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :**

విద్యార్థుల భౌవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులతోపాటు ఉపా ధ్యాయులపై ఉంటుందని మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ మెగా కిడ్స్ స్కూల్ 14వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రతి చిన్నారి ప్రతి భలను ప్రోత్స హించటం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న మెగా కిడ్స్ యాజమాన్యాన్ని అభినందిచారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేత లుగా నిలచిన చిన్నారులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రఘువీర్‌నాథ్ రావు, ప్రిన్సిపల్ సుచిత్రా పాటిల్, వైస్ ప్రిన్సిపల్ హరిప్రియ, త్రైక్వాండ్ వెంకటేశ్వరరావు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయ లయ్య విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలు ఆటగాళ్ల ప్రతిభను ఇనుమడింపజేస్తాయి

**- నార్సింగి బిఆర్ఎస్ అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి**



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథులు

**నార్సింగి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** క్రీడా పోటీలు ఆటగాళ్ల ప్రతిభను ఇనుమడింపజేస్తాయని నార్సింగి బిఆర్ఎస్ అధ్యక్షులు బి.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల్లో 21.జట్లు పాల్గొనగా, నార్సింగి డైమండ్స్ వారియర్స్ జట్టు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో గెలుపొంది ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు కప్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనం తరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ...ఆటలు మనలో చురుకుతనంను, ఆరోగ్యంను, ఆత్మ విశ్వాసంను పెంచుతాయన్నారు. గెలుపు-ఓటములను సమా నంగా స్వీకరించే గుణంను పెంచుతాయని తెలిపారు. పిల్లలు, పెద్దలు ఎవరై నా తమ సమకాలీకులతో ఆటలు ఆడటంను అలవా టుగా మార్చు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉప్ప రి ముత్యాలు, రవియాదవ్, ప్రభాకర్, వాసు, రమణ, కృష్ణ, చిరంజీ వి, ఆసిఫ్, వెంకట్, మహేందర్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిపారవశ్యంలో స్వరభారతి శివోహం



చిన్నారుల గాత్ర సంగీతకచేరిలో ఒక దృశ్యం

**నాంపల్లి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివోహం పేరుతో సంస్థ విద్యార్థులు, గురువులు, ఫౌండేషన్ సభ్యులు సం యుక్త పాల్గొని పరమశివుని స్తుతిస్తూ నిర్వహించిన గాత్ర, వాద్య, నాట్యప్రదర్శనల్లో ప్రతీ అంశంలోనూ శివనామస్మరణతో ఆహుతు లను శివోహం భక్తిపారవశ్యంలో ఓలలాడించింది. రెండువందలకు పైగా విద్యార్థులు వేణువు, వయోలిన్, మృదంగం, తబల వాయిద్యాలతో భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో మహిశివుడ్ని స్మరింపజేశారు. కేశవదాస్ షహనాయ్ వాద్యం, గాదేపల్లి శ్రీనివాస్ గాత్రంలో శివోహం, శివతాండవ స్తోత్రం తన్మయుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సలహాదారు రాధ, ప్రముఖ కర్ణాటక సంగీత గురువు పద్మావతి, ఆస్తానమీ విద్వాన్ ఆంజనేయులు,డైరెక్టర్ గాడిపల్లి సంధ్య, మేనేజర్స్ దివ్య, ప్రసన్న పాల్గొని విద్యార్థులకు జ్ఞాపికలు బహూక రించారు. గత దశా బ్దకాలంగా విద్యార్థులతో శివోహం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉత్సా హంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు తోడ్పడతాయి

**-డాక్టర్ అజయ్ కుమార్**



పోటీలను ప్రారంభిస్తున్న అజయ్‌కుమార్

**చిక్కడపల్లి ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** విద్యార్థుల సర్వతోముఖాభి వృద్ధికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని అరోరా డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సి.అజయ్ కుమార్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి అరోరా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ప్రతిష్టాత్మక "అరోరా ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ కుమార్ ప్రారంభించి ప్రసం గించారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా, క్రీడల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రీడాస్ఫూర్తి మరియు టీమ్ వర్క్ పెంపొందుతాయి" అని పేర్కొన్నారు. మొత్తం 32 జట్లు తలపడుతున్న ఈ మెగా టోర్నమెంట్ ఐదు రోజుల పాటు హోరా హోరీగా సాగనుంది. ఈ పోటీలలో గెలుపొందిన భారీగా బహుమ తులుంటాయన్నారు. ఈ టోర్నమెంట్ స్పాన్సర్, విసత్రీ కంపెనీ సీఈఓ కిరణ్ గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపి వ్యక్తిత్వ వికాసాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల శారీరక విద్యా దర్శకుడు అనిల్ కుమార్ వైస్ ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని క్రీడాకారులను ఉత్సా హపరిచారు.

## భారీగా నిషేధిత ఈ-సిగరెట్లు పట్టివేత

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లో విక్రయిస్తున్న నిషేధిత విదేశీ ఇ-సిగరెట్లను బంజారాహిల్స్ భారీగా స్వాధీనం చేసుకున్నా రు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహి ల్స్ రోడ్ నంబర్12లోని భాయి కీ చాయ్ సమీపంలో విదేశీ ఈసిగరెట్లు అక్రమంగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమా చారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తనిఖీ ల్లో ముషీరాబాద్‌కు చెందిన 21 ఏళ్ల విద్యార్థి ఒస్మాన్ ఘని చౌదరి పట్టుబడ్డాడు.అతని వద్ద నుంచి 4 ఎల్ఫ్‌బార్ (40, 000 పఫ్స్), 1 క్రౌన్‌బార్ (15,000పఫ్స్) సహా మొత్తం రూ.18,500 విలువైన నిషేధిత ఈసిగరెట్లు, ఒక ఐఫోన్ 16 ప్రో మాక్స్, అలాగే హోండా ఆక్టివా టీజీ 09 8936 ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసిన వస్తువుల విలువ రూ.68,500గా అంచనా వేశారు.విచారణలో నిందితుడు పుణేకు చెందిన ఇర్షా ద్ అనే వ్యక్తి నుంచి ఈ నిషేధిత ఈసిగరెట్లు తెప్పించి, ఆన్‌లై న్ ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు.



చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కానుగు రాధిక, దొంతి నరేష్‌గౌడ్

# మెదక్ మున్సిపల్ కాంగ్రెస్ కైవసం

### ఎక్స్ అఫీషియో ఓటుతో చైర్మన్ పదవి దక్కించుకున్న కాంగ్రెస్

**మెదక్ టౌన్, ఫిబ్రవరి 16,ప్రభాతవార్త:** మెదక్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగాయి. చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న 14 మంది కౌన్సిలర్లతో పాటు బీఎస్పీ 1, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఎక్స్‌అఫీషియో ఓటుతో చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది. ముందుగా 32 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టారు తర్వాత నిర్వహించిన చైర్మన్ ఎన్నికలకు 24వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కానుగు రాధిక మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా 20వ వార్డు కౌన్సిలర్ మన్సూర్ ప్రతిపాదించారు. వారి ప్రతి పాదనను 19వ వార్డు కౌన్సిలర్ గంట సంపత్ బలపరిచారు. కాంగ్రెస్ పార్టీ తరపున 14 మంది కౌన్సిలర్లు ఒక బీఎస్పీ కౌన్సిలర్ ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే రోహిత్‌రావు చేతులెత్తి బలపరిచారు. బిజెపి సభ్యులు ఎన్నిక సమయంలో లేకపోవడంతో 30 మంది సభ్యులలో ఎమ్మెల్యే ఓటుతో కలిపి 16 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థికి రావడంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందినట్టుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. బిఆర్ఎస్ పార్టీ తరపున మూడో వార్డు కౌన్సిలర్ కొట్టాల లలితను ఆ పార్టీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు ప్రతిపాదించారు. బట్టి ఉదయకుమార్ బలపరిచారు, వారికి సరిపోయిన అన్ని ఓట్లు లేకపోవడంతో ముందుగా 16 ఓట్లు వచ్చిన కానుగు రాధికను మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైనట్లుగా అధికారులు ప్రకటించారు .అనంతరం బిఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశం నుండి బయటకు వెళ్లిపోయారు. కోరం ఉన్నందున వైస్‌చైర్మన్ ఎన్నికను ఎన్నికల అధికారులు చేపట్టారు. వైస్‌చైర్మన్ అభ్యర్థిగా దొంతి నరేష్‌గౌడ్‌ను అరుణార్థి వెంకటరమణ ప్రతిపాదించారు. తోడుపునూరి శివరామకృష్ణ బలపరిచారు. దీంతో వైస్ చైర్మన్‌గా దొంతి నరేష్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ కానుగు రాధిక, దొంతి నరేష్‌గౌడ్‌లను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సత్కరించారు. రాబోయే రోజుల్లో మెదక్‌ను అభివృద్ధి చేసి చూపుతామని తెలిపారు.

## కెసిఆర్‌కు గిఫ్ట్ 5 మున్సిపాలిటీల్లో గెలుపు

### -రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీలపై బిఆర్ఎస్ జండా ఎగరేసి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు గిఫ్ట్‌గా ఇచ్చామని ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బిఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శరెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురంలోని బీరంగూడ కమాన్ వద్ద ఆదర్శ్‌రెడ్డి నివాసంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా, శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసిన హామీలను అమలుచేయకపోవడాన్ని ప్రజలు గుర్తించుకుని మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. మాజీమంత్రి హరీష్‌రావు సూచనలతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి సహకారంతో 5 మున్సిపాలిటీలపై బిఆర్ఎస్ జండాను ఎగరేయగలిగామన్నారు. నియోజకవర్గంలోని విలువైన భూములపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి అనుచరుల కన్ను పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కట్టుబానిసగా పనిచేస్తున్నారని ఆరోపించారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి గడీల శ్రీకాంత్‌రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, నాయకులు పట్నం మాణిక్యం, గోసుల శ్రీనివాస్, తొంట అంజయ్య యాదవ్, ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి, మేరాజ్ ఖాన్, మాణిక్‌యాదవ్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన మున్సిపల్ చైర్మన్



మాజీ మంత్రి చంద్రశేఖర్‌ను కలిసిన అశోక్, అబ్దుల్ హన్నన్ జావీద్

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** కోహీర్ మున్సిపాలిటికి సోమవారం కొత్తగా ఎన్నికైన చైర్మన్ మ్యాతరి అశోక్, వైస్ చైర్మన్ అబ్దుల్ హన్నన్ జావీద్ సోమవారం జహీరాబాద్‌లో మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను, కాంగ్రెస్ కౌన్సిలర్లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగా రెడ్డి, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియోద్దిన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శంషీర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హర్షద్ అలీ, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్‌రెడ్డి, శిరీషరాణి, రాజేశ్వరి, ఎంఎ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కౌన్సిలర్‌లకు సన్మానం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్లుగా ఎన్నికై సోమవారం రోజున అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కౌన్సిలర్‌లను మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ పరిపాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి బిఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఐక్యంగా పనిచేయాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీ ప్రతిష్ఠను మరింతపెంచాలని ఆయన ఆకాంక్షించారు. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలు, నాయకుల కృషివల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన కౌన్సిలర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్‌లో ప్రజాప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతామని కౌన్సిలర్‌లు ఈ సందర్భంగా తెలిపారు.



బిఆర్ఎస్ కౌన్సిలర్‌లను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ కైవసం

### చైర్మన్‌గా గంగిశెట్టి చందన, వైస్ చైర్మన్‌గా కళ్యాణ్‌కార్ పద్మాబాయి

**గజ్వేల్, ఫిబ్రవరి 16(ప్రభాతవార్త):** గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని బిఆర్ఎస్ పార్టీ అనుకున్నట్లుగానే కైవసం చేసుకుంది. సోమవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా గెలుపొందిన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. స్థానిక ఆర్డీవో చంద్రకళ, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో 1వ వార్డు కప్పు మమత(బిఆర్ఎస్), 2వ వార్డు గోలి మమత సంతోష్(బిఆర్ఎస్), 3వ వార్డు కాముని మురళి(బిఆర్ఎస్), 4వ వార్డు రొట్టెల శ్రీనివాస్(బిజెపి), 5వ వార్డు మన్నె రూప వెంకటేష్(బిఆర్ఎస్), 6వ వార్డు బొగ్గుల స్వప్న సురేష్(బిఆర్ఎస్), 7వ వార్డు మన్నె విష్ణు వర్ధన్‌రెడ్డి(కాంగ్రెస్), 8వ వార్డు గుగులోతు రమేష్(కాంగ్రెస్), 9వ వార్డు ఉపేందర్‌రెడ్డి(కాంగ్రెస్), 10వ వార్డు కోట బాబు రాజు(బిఆర్ఎస్), 11వ వార్డు కొలిచెలిమిల భవాని (బిఆర్ఎస్), 12వ వార్డు నర్సింహారెడ్డి(కాంగ్రెస్), 13వ వార్డు మర్కంటి భాగ్యలక్ష్మి(బిఆర్ఎస్), 14వ వార్డు గుంటుకు లక్ష్మిశ్రీనివాస్(కాంగ్రెస్), 15వ వార్డు నక్క సంతోషి రాములు గౌడ్(కాంగ్రెస్), 16వ వార్డు నాయిని సత్యలక్ష్మి యాదగిరి (కాంగ్రెస్), 17వ వార్డు కళ్యాణ్‌కార్ పద్మాబాయి (బిఆర్ఎస్), 18వ వార్డు మామిడి శ్రీధర్(బిఆర్ఎస్), 19వ వార్డు గంగిశెట్టి చందన(బిఆర్ఎస్), 20వ వార్డు అత్తెల్లి శ్రీనివాస్ (స్వతంత్ర) అభ్యర్థులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆర్డీవో చంద్రకళ మాట్లాడుతూ 12.30 గంటలకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని వివరించారు. మొదటగా ఏకగ్రీవం పద్ధతి ఉంటుందని, రెండవది ఒకరిని ప్రపోజల్ చేస్తే ఇతర సభ్యులు చేతులెత్తడం ద్వారా, మూడవది ఇద్దరు అభ్యర్థులు చైర్మన్ బరిలో ఉంటే సభ్యులు సమానంగా చేతులెత్తి మద్దతు తెలిపితే డ్రా తీసి చైర్మన్‌ను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 12.30 గంటలకు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించగా మొదటగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ అభ్యర్థి మన్నె విష్ణువర్ధన్‌రెడ్డి నాయిని సత్యలక్ష్మికి చైర్మన్ అభ్యర్థిగా ప్రపోజల్ చేయగా మరో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గుగులోతు రమేష్ బలపర్చడం జరిగింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు సత్యలక్ష్మికి మద్దతుగా చేతులెత్తారు. కాంగ్రెస్ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ లేకపోవడంతో చైర్మన్‌గా ఎన్నుకోవడం అనివార్యమైంది. అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ అభ్యర్థిగా గంగిశెట్టి చందన రవీందర్‌ను అదే పార్టీకి చెందిన కౌన్సిలర్ శ్రీధర్ ప్రపోజల్ తెలుపగా మరో కౌన్సిలర్ గోలి మమత బలపర్చడంతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో పాటు స్వతంత్ర అభ్యర్థి అత్తెల్లి శ్రీనివాస్, బిజెపి అభ్యర్థి రొట్టెల శ్రీనివాస్ ముదిరాజ్‌తో కలిసి మొత్తం 14 మంది సభ్యులు గంగిశెట్టి చందన రవీందర్‌కు మద్దతు తెలుపడంతో చైర్మన్‌గా ఆర్డీవో చంద్రకళ ప్రకటించారు. అలాగే వైస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపేందర్‌రెడ్డిని తమ పార్టీకి చెందిన కౌన్సిలర్లు బలపర్చగా కోరం లేకపోవడంతో ఎన్నిక అనివార్యమైంది. అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ కళ్యాణ్‌కార్ పద్మాబాయిని వైస్ చైర్మన్‌గా 14 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు తెలుపడంతో ఆర్డీవో చంద్రకళ వైస్ చైర్మన్‌గా ప్రకటించారు.



చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న గంగిశెట్టి చందన

**బిఆర్ఎస్‌కు బిజెపి మద్దతు...**

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో సమక్షంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఈక్రమంలో బిఆర్ఎస్ అభ్యర్థి గంగిశెట్టి చందన రవీందర్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్న క్రమంలో బిజెపికి చెందిన అభ్యర్థి రొట్టెల శ్రీనివాస్ చేతులెత్తి మద్దతు తెలిపారు.దీంతో పట్టణంలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు రెండు ఒక్కటయ్యాయని చర్చనీయాంశంగా మారింది. అలాగే బిఆర్ఎస్ పార్టీకి స్వతంత్ర అభ్యర్థి అత్తెల్లి శ్రీనివాస్ సైతం మద్దతిచ్చారు. దీంతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సునాయాసంగా జరిగింది.

**షీల్డ్ కవర్‌లో చైర్మన్, వైస్ చైర్మన్‌ల పేర్లు**

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన 11 మంది అభ్యర్థులు గెలుపొందగా గత నాలుగు రోజుల నుండి క్యాంపుకు వెళ్ళిన విషయం తెలిసిందే. గెలిచిన అభ్యర్థుల్లో కొందరు చైర్మన్, వైస్ చైర్మన్ పదవి కోసం అధిష్ఠానం వద్ద పైరవీలు కొనసాగించారు. నలుగురు అభ్యర్థులు చైర్మన్ పదవి తనకంటే తనకని అధిష్టానంకు సిఫారసు చేశారు. అందులో తెలంగాణ ఉద్యమం మొదటి నుండి కీలకంగా పనిచేసిన కళ్యాణ్‌కార్ నర్సింగరావు సతీమణి పద్మాబాయి, గంగిశెట్టి చందన రవీందర్, బొగ్గుల స్వప్న సురేష్‌తో పాటు మరొకరు చైర్మన్ పదవిని ఆశించారు. దీంతో వంటేరు ప్రతాప్‌రెడ్డి రంగంలోకి దిగి తన అనుచరుడు అయిన గంగిశెట్టి చందన రవీందర్ పేరును అధిష్టానంకు సిఫారసు చేయగా నేరుగా మున్సిపల్ కార్యాలయంకు 10.30 గంటలకు షీల్డ్ కవర్ రావడంతో స్థానిక ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌కు అందజేశారు. అనంతరం షీల్డ్ కవర్‌లో ఉన్న పేర్లు గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్‌గా కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావును అధికారికంగా ప్రకటించారు.

**ఏసిపి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు**

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా గజ్వేల్ ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో స్థానిక సిఐ రవికుమార్ భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థులు క్యాంపుకు వెళ్లగా సోమవారం ఉదయం 9 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి బస్సులో చేరుకున్నారు. దీంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున మున్సిపల్ కార్యాలయానికి రావడంతో పోలీసులు వారిని అదుపుచేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అనుచరుడికే గజ్వేల్ - ప్రజ్ఞాపూర్ పీఠం

### ఉద్యమనేత నర్సింగరావు సతీమణికి మొండిచేయి.. అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ నాయకుల నిరసన

**గజ్వేల్, ఫిబ్రవరి 16 (ప్రభాతవార్త):**

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికలు మాజీ మంత్రి హరీష్‌రావు, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మధ్య అగ్గి రాజేసింది. మున్సిపల్ ఎన్నికల ముందస్తు వ్యూహంలో భాగంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి తన వర్గానికి చెందిన 16 మంది అనుచరులకు బిఆర్ఎస్ పార్టీ బిఫాంలను ఇప్పించుకున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన ఉద్యమ నాయకుని కోటాలో కళ్యాణ్‌కార్ నర్సింగరావు సతీమణి పద్మాబాయికి మాజీ మంత్రి హరీష్‌రావు బిఫాం ఇచ్చారు. అయితే మరో ఇద్దరు అభ్యర్థులు తమకు సంబంధించిన బడా నాయకుల కోటాలో బిఫాంలు తీసుకున్నారు. వీరిలో బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన 11మంది అభ్యర్థులు విజయం సాధించిన విషయం అందరికి తెలిసిందే. కాగా ఈ క్రెడిట్ అంతా నాదేనని స్పష్టం చేస్తూ మాజీ మంత్రి హరీష్‌రావుతో వంటేరు ప్రతాప్‌రెడ్డి కాలుదువ్వారు. అయితే అంతకు ముందే తన అనుచరుడు ఉద్యమకారునిగా పేరున్న పార్టీ సీనియర్ నేత నర్సింగరావు సతీమణి పద్మాబాయికి మాజీ మంత్రి హరీష్‌రావు చైర్మన్ పదవి ఇస్తానని మాట ఇచ్చి కౌన్సిలర్‌గా గెలుపొందాలని బిఫాం ఇచ్చినట్లు సమాచారం. అందుకు విరుద్దంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి తన అనుచరుడైన గంగిశెట్టి రవీందర్ సతీమణి చందనకు చైర్మన్ పదవి ఇవ్వాలని మొండికేసినట్లు తెలిసింది. తన అనుచరునికి చైర్మన్ పదవి ఇవ్వకుంటే పార్టీ రెండుగా చీలుతుందని హెచ్చరించడంతో పార్టీ అధిష్టానం ఆలోచనలోపడ్డది. అయితే ఇదే అదునుగా భావించిన కాంగ్రెస్ తమకు అనుకూలంగా వ్యూహాలు రచించడంతో అది తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ ముందుగానే ప్రతాప్‌రెడ్డికి సంబంధించిన గంగిశెట్టి చందన రవీందర్‌ను చైర్మన్‌కు అధిష్టానం సిఫారసు చేసింది. రెండు రోజులుగా పార్టీ అధిష్టానం వంటేరుకు నచ్చజెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఉద్యమకారునికి చైర్మన్ పదవి చేజారింది. అధిష్టానం చైర్మన్‌గా గంగిశెట్టి చందన, వైస్ చైర్మన్‌గా పద్మాబాయిని ఖరారు చేస్తూ షీల్డ్ కవర్ పంపించింది. అయితే ఉద్యమకారుడు నర్సింగరావుకు పార్టీ అధిష్టానం న్యాయం చేస్తుందనే నమ్మకంతో ఉండగా వంటేరు ప్రతాప్‌రెడ్డి చర్యలతో అధిష్టానం చేతులెత్తేయడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతుంది. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ప్రకటించడంతో కళ్యాణ్‌కార్ నర్సింగరావుతో పాటు తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు పెద్దఎత్తున అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళనకు దిగారు.



గజ్వేల్‌లో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

### ఒకరిని ముందు పెట్టి మరొకరి బలి

**-గతంలోనూ బిఆర్ఎస్‌ది ఇదే తీరు**

మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీష్‌రావులు గజ్వేల్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వంటేరు నారాయణ రెడ్డికి గతంలో మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తామని చెప్పి 2వ వార్డులో బిఫాం ఇవ్వగా కౌన్సిలర్‌గా గెలుపొందారు. అనంతరం జరిగిన పరిణామాలలో భాగంగా షీల్డ్ కవర్‌లో మున్సిపల్ చైర్మన్ పదవిని పట్టణానికి చెందిన ఎన్.సి.రాజమౌళి పేరు ఉండదంతో నారాయణరెడ్డి మనస్థాపం చెంది కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడం జరిగింది. ప్రస్తుతం మరోసారి తెలంగాణ ఉద్యమకారుడైన నర్సింగరావు సతీమణి పద్మాబాయికి చైర్మన్ పదవి దక్కకపోవడంతో ఉద్యమకారులు ఆందోళన బాటపట్టారు.ఏది ఏమైనా బిఆర్ఎస్ పార్టీలో చెప్పేది ఒకటి చేసేది ఒకటని పట్టణంలో ప్రచారంసాగుతోంది. బిఆర్ఎస్ పార్టీలో వంటేరు ప్రతాప్‌రెడ్డి తన అనుచరగణానికే పార్టీ పదవులు కట్టబెడుతున్నారని నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఉన్నప్పటికీ అతనికి తెలియకుండానే ఇలాంటి కార్యక్రమాలు జరగడం వల్ల గతంలో ఒసారి యాదవరెడ్డి పార్టీలో ఉండటానికి ఇష్టపడటంలేదని సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టాయి. ఇప్పటికైనా బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులకు సముచిత స్థానాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఆలయ ప్లంబర్ విజయ్‌కుమార్ సస్పెన్షన్

**కొమురవెల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఈనెల 12న హుండీ లెక్కింపు సందర్భంగా రూ.9 వేల నగదు అపహరణ చేసిన సంఘటనలో ఆలయంలో ప్లంబర్‌గా పనిచేస్తున్న ఎస్.విజయ్‌కుమార్‌ను ఆలయ క్రమశిక్షణ నియమావళి ప్రకారం ఈవో వెంకటేషం సస్పెండ్ చేశారు.

## కష్టపడి పనిచేసేవారికి కాంగ్రెస్ పార్టీ గుర్తింపు

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



నూతన చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే రోహిత్‌రావు

**మెదక్ టౌన్ ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మున్సిపల్ నూతనంగా ఎన్నికైన చైర్మన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్‌లను ఆయన అభినందించారు.అనంతరం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి సాధించిన విషయాన్ని ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టి మెదక్ మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం అభినందనీయమన్నారు. నూతన పాలకవర్గం పట్టణాభివృద్ధికి కృషి చేస్తూ సేవలందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షను జయప్రదం చేయండి : ఆశన్నగౌడ్



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16, ప్రభావతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీతా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని, బడ్జెట్‌లో గౌడ కులస్తుల సంక్షేమానికి, గీత కార్మికుల ఉపాధికి రూ. 5000 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరాహారదీక్ష నిర్వహించడం జరుగుతుందని ఈ నిరాహార దీక్షకు జిల్లా లోని గౌడ సోదరులు గీతా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు ఆశన్నగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ కలిసి మాట్లాడుతూ పిలుపునిచ్చారు. సోమవారం సంగారెడ్డి లోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

## తొగుటలో ఘనంగా శివ కళ్యాణం

**తొగుట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీభవాని రామలింగేశ్వర ఆలయంలో శివ కళ్యాణాన్ని పురోహితులు జయరామ పంతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా మహాశివరాత్రి రోజున శివ కళ్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జయరామ పంతులు మాట్లాడుతూ కోరుకున్న కోరికలు నెరవేర్చే శ్రీభవాని రామలింగేశ్వరుడని తెలిపారు.అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాగాల శోభ కొండల్‌రెడ్డి, క్యాస చంద్రశేఖర్. పద్మ, రాజ్‌కుమార్, నల్లబెల్లి అంజనేయులు, రవీందరెడ్డి,వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో చీరెల పంపిణీ

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త :** సిద్దిపేట ఇందిరమ్మ కాలనీ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్ వెంకటలక్ష్మీ ఆర్థిక సహాయంతో వైశ్య భవన్‌లో గోసేవ, ఇందిరిమ్మ కాలనీలోని మనస్ఫూర్తి వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, టవల్స్ పంపిణీతోపాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గంప శ్రీనివాస్ వెంకటలక్ష్మీ, మాకల శ్రీనివాస్, మనోజ్, కిషోర్, వృద్ధాశ్రమ స్థాపకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కొమురవెల్లి మల్లన్న పెద్దపట్నం



పెద్దపట్నం వేసిన దృశ్యం



స్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకవస్తున్న అర్చకులు

**కొమురవెల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో ప్రముఖ క్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రానికి భక్తులు భారీగాపోటెత్తారు. మహాశివరాత్రి సందర్భంగా మల్లన్న ఆలయంలో పెద్దపట్నం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని స్తుతిస్తూ పెద్దపట్నం కార్యక్రమం రాత్రి 12 గంటలకు ప్రారంభించి వేకువజాము వరకు కొనసాగించారు. అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకవచ్చి పట్నం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు పట్నం దాటిన అనంతరం భక్తులు మల్లన్నను దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులు 46 వరుసలతో పంచవర్ణాలతో వేసిన పెద్దపట్నాన్ని దాటేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆలయంలో అర్చన, కళ్యాణ మండపం వద్ద ఒగ్గు పూజారుల పట్నం ఒకేసారి కొనసాగుతాయి. మల్లన్నను స్తుతిస్తూ స్వామివారి చరిత్రను ఒగ్గు కథ రూపంలో చెప్పారు. ఒగ్గుకథ చెబుతూ పూజారులు 5 రంగులతో పెద్దపట్నంవేస్తారు. అది పూర్తికాగానే పట్నంలోకి బోనాన్ని తర్వాత స్వామివారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు మల్లన్న నామస్మరణ చేస్తూ పట్నంపైకి దాటారు. పంచరంగుల చూర్ణాన్ని తీసుకెళ్లేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం నల్లపోచమ్మ, కొండపోచమ్మ ఆలయాలకు వెళ్లి అక్కడ అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

తోట బావి వద్ద నిర్వహించిన పట్నానికి సీపీ రష్మీ పెరుమాళ్ పాల్గొని పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. కార్యక్రమం లో ఈవో వెంకటేశం, ఏఈవోలు బుద్ది శ్రీనివాస్, రావుల సుదర్శన్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, సర్పంచ్ గొల్లపల్లి పద్మ అంజనేయులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఒగ్గు పూజారులు, అర్చకులు, సిబ్బంది, పోలీసు,ఫైర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుస్నాబాద్ ఎసిపి సదానందం పర్యవేక్షణలో ఎస్ఐ తోట మహేష్ గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు.

# జిల్లాలో కొలువుదీరిన నూతన పాలకవర్గాలు

### నాలుగు మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలను అధిరోహించిన మహిళలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలోని సిద్దిపేట మున్సిపల్ మినహాయించి హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాక మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లతోపాటు పాలకవర్గం కొలువు దీరడంతో మున్సిపల్ ఎన్నికల చివరి ఘట్టం ప్రశాంతంగా ముగిసింది. హుస్నాబాద్ ఎస్సీ జనరల్, చేర్యాల ఎస్సీ మహిళా, దుబ్బాక, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ బిసి మహిళలకు కేటాయించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలో హుస్నాబాద్ కాంగ్రెస్ కైవసం చేసుకోగా చేర్యాల, గజ్వాల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాక మున్సిపాలిటీలను బిఆర్ఎస్ దక్కించుకున్న విషయం తెలిసిందే!. హుస్నాబాద్ మున్సిపాలిటీ నూతన కౌన్సిలర్లు తప్ప మిగితా మూడు మున్సిపాలిటీల కౌన్సిలర్లు క్యాంపుకు తరలివెళ్లి సోమవారం నిర్వహించిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు నేరుగా మున్సిపల్ కార్యాలయాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఎన్నికల అధికారులు ఆయా మున్సిపాలిటీలలో మొదట కౌన్సిలర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పార్టీ అధిష్టానాలు చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లను ఖరారు చేస్తూ పంపిన సీల్డ్ కవరును ఎన్నికల అధికారి తెరిచి అందులో ఉన్న పేర్లను చదవి వినిపించడంతో సభ్యులు ఏకగ్రీవంగా అమోదించారు. దీంతో ఎన్నికల అధికారులు చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా దండి లక్ష్మీ, వైస్ చైర్మన్‌గా చిత్తారి పద్మ, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా గంగిశెట్టి చందన, వైస్ చైర్మన్‌గా కళ్యాణ్‌కార్ పద్మాబాయిలు ప్రమాణ స్వీకారం చేశారు.దుబ్బాకలో చైర్మన్‌గా శ్రీరామ్ సంగీత, వైస్ చైర్మన్‌గా ఆశ సులోచన, చేర్యాల మున్సిపల్ చైర్మన్‌గా ముస్త్యాల అరుణ,వైస్ చైర్మన్‌గా మేడిశెట్టి ఉమాలు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ పీఠాలను మహిళలే అధిరోహించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీని ఎస్సీ జనరల్‌కు కేటాయించినప్పటికీ అక్కడ చైర్మన్ పదవిని ఆశించిన కెడం లింగమూర్తి ఓటిమి చెందడంతో చైర్మన్ పీఠాన్ని మహిళకు కేటాయించారు. కాగా హుస్నాబాద్‌లో జరిగిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు. మొత్తం మీద జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఘట్టం నామినేషన్ల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక చివరి ఘట్టం వరకు ప్రశాంతంగా సాగడంతో జిల్లా అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా 4 మున్సిపాలిటీలలో పురుషులకు కనీసం వైస్‌చైర్మన్ పదవులు దక్కకపోవడం గమనర్హాం.



చేర్యాలలో మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకుంటున్న దృశ్యం

## శివపార్వతుల కళ్యాణోత్సవానికి తరలిన భక్తులు

**మనూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ మండలపరిధిలోని పంచగామలోని పంచలింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహించే శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి మాయికోడ్ గ్రామం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఆచారంమేరకు గ్రామానికిచెందిన ఇద్దరిని శివపార్వతులుగా వేషధారణచేసి భారీ ఊరేగింపుతో అందంగా అలంకరించిన వాహనంపై కూర్చోబెట్టుకుని పంచగామ ఆలయానికి ఊరేగింపుగా సోమవారం తరలివెళ్లారు. కళ్యాణ మహోత్సవానికి అవసరమైన సామగ్రితో మండల కేంద్రమైన మనూర్, పిప్రి గ్రామాలమీదుగా బోరంచకు ఊరేగింపుగా చేరుకుని ఆలయంలో నేత్రపర్వంగా శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ముగిసిన ఉమ్మడి జిల్లా ఖోఖో క్రీడలు

**-విజేతలకు బహుమతుల ప్రదానం**



ఖో-ఖో విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

**చౌటకూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన చౌటకూరులోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో గత రెండురోజులుగా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి సీజన్- ఓపెన్ టూ ఆల్ ఖో-ఖో క్రీడలు ఆదివారం రాత్రితో ముగిసాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా మండలాల నుంచి 16 జట్లు పాల్గొని పోటీల్లో తలపడగా ఫైనల్ పోటీలో చౌటకూరుకుచెందిన సీనియర్‌జట్టు విజేతగానిలిచి రూ.20వేలు, అందోలు మండలం డాకూర్‌కుచెందిన స్ట్రాంగ్ ట్రీస్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచి రూ.15వేలు, తృతీయస్థానంతో సరిపెట్టుకున్న చౌటకూరు జూనియర్‌జట్టు రూ.10వేలు బహుమతులను అందుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి బిజెపి నాయకురాలు చంటి దేవికప్రభు, చౌటకూరు సర్పంచి పార్కల రాంరెడ్డి, మాజీ ఉపసర్పంచి కలాలి రామాగౌడ్, నాయకులు అందోలు కృష్ణ, పల్లె ప్రభుకుమార్‌గౌడ్, మొగులయ్య, వర్కల రమేష్, గోరేమియా, దమ్మీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



సేవాలాల్ మహారాజ్ జయంతి దృశ్యం

**సిర్గాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని జమ్లాతాండ పంచాయతీ పరిధిలోని అమ్లేట్ గ్రామమైన జీవులతాండలో బంజారా ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతిని మాజీసర్పంచి దివ్యభారతిచరణ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. వేడుకలను గిరిజనులు, భక్తులు సేవాలాల్ పగిడితో భవానీమాత ఆలయంవద్ద భోగ్‌బండార్ నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ సమాజోద్ధరణకు చేసిన సేవలను మాజీసర్పంచి గుర్తుచేసుకున్నారు. తాండ నుంచి మండల కేంద్రమైన సిర్గాపూర్ వరకు డిజె సౌండ్, డప్పువాయిద్యాలతో చేరుకుని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు శ్రీనివాస్‌రావు, రాథడ్ వినోద్, మంజుల వినోద్, గ్రామప్రముఖులు, మాజీసర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు కళ్యాణ్‌రావు, సంజీవన్‌రావు, నరసాగౌడ్, రాజాగౌడ్, రమేష్, నారాయణనాయక్, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం



మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సన్మానం చేస్తున్న దృశ్యం

**టేక్మాల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నూతనంగా అందోల్ జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కృష్ణరెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబులను టేక్మాల్ మండల కాంగ్రెస్‌పార్టీ పోమవారం ఘనంగా సన్మానించారు. ఇందులో టేక్మాల్ కాంగ్రెస్‌పార్టీ కమిటీ అధ్యక్షులు నిమ్మ రమేష్, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి తిమ్మిగారి సుధాకర్, మెదక్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ చైర్మన్ షేక్ మజహర్, మాజీ వైస్ ఎంపిపి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచి ఆకులపల్లి పాపయ్య, ఆశిల సాగర్, మాజీ సొసైటీ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కుస్తీపోటీలో గైరన్‌తాండ యువకుడు



జాతీయస్థాయి కుస్తీ పోటీలో తలపడుతున్న చరణ్‌జాదవ్

**సిర్గాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని గైరాన్‌తాండకుచెందిన యువకుడు చరణ్‌జాదవ్ జాతీయస్థాయి కుస్తీపోటీలో సత్తాచాటాడు. ఢిల్లీలో జరిగిన ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్-2026 కుస్తీపోటీలో చరణ్‌జాదవ్ పాల్గొని మల్లయోధుడితో కుస్తీపడి మూడవస్థానంలో నిలిచి కాంస్యపతకం కైవసం చేసుకున్నాడు. ఇటీవల రాష్ట్రస్థాయిలో గోల్డ్‌మెడల్ గెలిచిన చరణ్ జాతీయస్థాయిలో సైతం రాణించడం పట్ల గ్రామసర్పంచి మోహన్, బంధుమిత్రులు హర్షం వ్యక్తంచేస్తూ అభినందించారు.

## కన్నులపండుగగా పార్వతీపరమేశ్వరుల కళ్యాణం

**సదాశివపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మహాశివరాత్రిని పురస్కరించుకొని స్థానిక శ్రీసంగమేశ్వర మందిరంలో ఆదివారంరాత్రి 12గంటలకు ఆలయపూజారులు జి.మోహన్రావు. బిఎన్. శంకరరావు, నారాయణరావుల ఆధ్వర్యంలో మాడుగుల సర్వోత్తమశర్మ సారథ్యంలో పార్వతీపరమేశ్వరుల కళ్యాణం బుగ్గారం శ్రీనివాస్, రాజేశ్వరి దంపతులు, మాడిశెట్టి మనోజ్, సుస్మిత దంపతులు పార్వతీపరమేశ్వరుల కళ్యాణాన్ని కన్నులపండుగగా నిర్వహించారు. మారేపల్లి వెంకటేశంగౌడ్ సౌజన్యంతో, భక్తులకు ప్రసాదవితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ భక్తబృందం పూర్ణచందర్, ఆకుల శివకుమార్, మారేపల్లి చిన్నశివకుమార్, ముంగి మల్లేశం, మాడిశెట్టి వీర్‌ప్రతాప్, సుధాకర్, నరసింహారెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రాచన్నస్వామి, పరమేష్, రాజన్నగురుస్వామి. సుబ్రహ్మణ్యం. భక్తబృందం పాల్గొన్నారు.

# కోహీర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా

**-చైర్మన్‌గా మ్యాతరి అశోక్**
**-వైస్ చైర్మన్‌గా అబ్దుల్ హన్నన్ జావీద్**

**జహీరాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నూతనంగా ఏర్పడిన కోహీర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో నిర్వహించిన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో మున్సిపాలిటీలోని 4వ వార్డు నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్‌గా ఎన్నికైన మ్యాతరి అశోక్‌ను చైర్మన్‌గా, 7వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికైన అబ్దుల్ హన్నన్ జావీద్‌ను వైస్ చైర్మన్‌గా కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. ఉదయం 11గంటలకు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్‌లతో మున్సిపల్ కమిషనర్ ప్రమాణస్వీకారం చేయించగా, కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు.

**ఎస్సీ జనరల్‌కు రిజర్వు అయిన చైర్మన్...**

కోహీర్ మున్సిపాలిటీ చైర్మన్ పదవి ఎస్సీ జనరల్‌కు రిజర్వు అయిన విషయం పాఠకులకు విదితమే. మున్సిపల్‌లో 16 వార్డులు ఉండగా 8 స్థానాలను కాంగ్రెస్, 5 స్థానాలను బిఆర్ఎస్, ఒక స్థానం బిజెపి, మరో స్థానం ఎంఐఎం, ఇంకో స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థులను మున్సిపల్ ఓటర్లు కౌన్సిలర్లుగా ఎన్నుకున్న విషయం పాఠకులకు విదితమే.

కాంగ్రెస్‌పార్టీకి మ్యాజిక్ ఫిగర్ అయిన 9 స్థానాలు దక్కకపోవడంతో స్వతంత్ర, ఎంఐఎం కౌన్సిలర్ల మద్దతుతో కాంగ్రెస్‌పార్టీ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను దక్కించుకుంది. నూతనంగా మున్సిపాలిటీకి తొలిమారు ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లను మున్సిపల్ కమిషనర్‌తోపాటు కౌన్సిలర్లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసేలా జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు ఆధ్వర్యంలో కోహీర్ ఎస్ఐ నరేస్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## సమాచారం లేకుండా లోకల్ హాలిడే..!

**-ఎల్లుపేట స్కూల్‌లో అసలు ఏం జరుగుతోంది..?**




ఎల్లుపేట పాఠశాలలో హాజరైన ఉపాధ్యాయులు

**టేక్మాల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

టేక్మాల్ మండలపరిధిలోని ఎల్లుపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుల ఐక్యత లోపించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మున్సిపాల్ ఎన్నికల విధుల్లో ఉండగా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులుగా సిద్ధిరాములు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా సోమవారం లోకల్ హాలీడే ప్రకటిస్తున్న విషయాన్ని తోటి ఉపాధ్యాయులకు చెప్పకుండా సొంతనిర్ణయం తీసుకోవడం పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తున్నారు. పదవతరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ ఎగ్జామ్స్ ఉన్నాయన్న ఉద్దేశంతో పాఠశాలకుచెందిన ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు తోటి ఉపాధ్యాయులకు ఎలాంటి సమాచారం అందించకుండానే సెలవులు ప్రకటించడం ఎంతవరకు సమంజసం అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. టేక్మాల్ మండలంలో ఈ విషయం ఉపాధ్యాయ సంఘాల్లో చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలో ఉపాధ్యాయుల తీరు వల్ల ఇటు విద్యార్థులు అటు ఉపాధ్యాయుల మధ్య సయోధ్య కుదరక గొడవలు తలెత్తుతున్నాయి అన్న అంశం తెరపైకి వస్తుందని తెల్సింది. విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుల మధ్య ఆధిపత్య పోరు జరుపుకుంటున్నారా..? లేక అసలు ఈ పాఠశాలలో ఏం జరుగుతుంది అనే విషయాలపై సమగ్ర విచారణ చేయాల్సి ఉంది.

**జిల్లా విద్యాధికారి వివరణ:**

పై విషయమై మెదక్ జిల్లా విద్యాధికారి విజయను ప్రభాతవార్త వివరణ కోరగా, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడగండి అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులకు తెలియకుండా లోకట్ హాలీడే తీసుకోవచ్చా అని ప్రశ్నించగా అందరికి సమాచారం ఇచ్చే సెలవు తీసుకోవాలన్నారు. ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫోన్‌చేశామని ఆయన ఎన్నికలవిధుల్లో ఉన్నారన్నారు. విచారణ జరుపుతామన్నారు.

## శ్రీదుర్గామాత ఉత్సవాల్లో ఘనంగా బండ్ల ఊరేగింపు



బండ్ల ఊరేగింపులో పాల్గొన్న సర్పంచి శివకుమార్‌తోపాటు గ్రామస్థులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంటగ్రామంలో శ్రీదుర్గామాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లోభాగంగా సోమవారం ఘనంగా బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామసర్పంచి గుండె శివకుమార్ తెలిపారు. శ్రీదుర్గామాత ఉత్సవాలకు గ్రామప్రజలు, పరిసర గ్రామాల భక్తులు హాజరయ్యి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమంలో సర్పంచి గుండె శివకుమార్, శ్రావణ్ కుమార్, మాణయ్య, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షులు విజయ్‌యాదవ్, బాలరాజ్, విజయకుమార్, బిక్షపతిగౌడ్, వీరయ్య, బాలు, నరేశ్, సందీప్, సత్యనారాయణ, నాగేశ్, శ్రీకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బండ్ల ఊరేగింపు




చిన్నశంకరంపేటలో బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

శ్రీసోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం, మంగళహారతి, అర్చన, గుమ్మటాల ఊరేగింపు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రుద్రారంలో సంగమేశ్వర ఆలయంలో జలపందిరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సర్పంచి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఉత్సవాలకు భజనలు, సకల సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## నిరాహార దీక్షను జయప్రదం చేయాలి

**మునిపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2026-27 బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5000కోట్లు కేటాయించాలని, కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17వ తేదీన ఇందిరాపార్క్ వద్ద చేపడుతున్న నిరాహారదీక్షకు రాష్ట్రం నలుమూలల నుండి వేలాదిమంది గీత కార్మికులు తరలిరావాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం బుదేరా చౌరస్తాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్యక్రమంలో గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కల్లు షాపులపై ఎక్సైజ్ దాడులను అరికట్టాలని తదితర డిమాండ్ల సాధనకై తాము నిరహారదీక్ష చేపట్టినట్టు ఆయన తెలిపారు.

## శివనామస్మరణతో మారుమ్రోగిన శివక్షేత్రాలు



తేనె తుట్టెతో అభిషేకం చేస్తున్న శివస్వాములు

**సదాశివపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

శివయ్యకు మాధవానందసరస్వతిస్వామి, బ్రహ్మానందతీర్థస్వామి, కీర్తిశేషులు నరసింహారావు గురుస్వామి ఆశీస్సులతో శ్రీసంగమేశ్వర దేవాలయంలో విశేషమైన అభిషేకాలుచేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పార్వతీసమేతసంగమేశ్వర దేవాలయంలో రోజంతా తెల్లవారేవరకు నారాయణరావుపంతులు ఆధ్వర్యంలో రోజంతా అభిషేకాలు జరగగా, రాత్రి 11గంటలకు జరిగే లింగోద్భవ కార్యక్రమంలో స్వామివారికి భస్మంతో అభిషేకంచేసే కార్యక్రమాన్ని శంకర్రావుపంతులు, నారాయణపంతులు ఆధ్వర్యంలో శివస్వాములు నిర్వహించారు. మాడిశెట్టి సుస్మితమనోజ్, బుగ్గారం రాజేశ్వరిశ్రీనివాస్‌గుప్తా జంటలు రాత్రి 12గంటలకు స్వామివారికి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తరువాత స్వామివారి మూర్తులను పట్టణవీధుల గుండా శివస్వాముల భజనలు, కీర్తనలతో ఊరేగింపుగా వచ్చి, మంగళహారతులు ఇచ్చారు. భక్తులకు మారేపల్లి వెంకటేశంగౌడ్ ప్రసాద వితరణచేశారు.

## వైభవంగా ఉమాసంగమేశ్వరస్వామి కళ్యాణం

**-ఆకట్టుకున్న బండ్ల ఊరేగింపు**



ఆలయం చుట్టూ బండ్ల ప్రదక్షణ నిర్వహిస్తున్న భక్తులు

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని కొప్పోలు ఉమాసంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మూడవరోజు అంగరంగవైభవంగా కొనసాగాయి. ఈ క్రమంలో సోమవారం బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల నుండి ఎద్దులబండ్లను భక్తులు సర్వాంగసుందరంగా అలంకరించి, బాజాభజంత్రీలతో, యువకుల నృత్యాలతో, స్వామివారి ఆలయంచుట్టూ ప్రదక్షణం నిర్వహించారు. అదేవిధంగా ఉదయం ఆలయంలో ఉమాసంగమేశ్వర కళ్యాణ మహోత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడివో క్రాంతికుమార్, ఈవో వెంకటరాములు, ఆలయకమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరమేశ్వర్‌రెడ్డి, రాయిని మధుసూదన్, కోశాధికారి రాజశేఖర్‌రెడ్డి, ఆయాగ్రామాలకు సర్పంచులు, ఆలయకమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడు ఎస్సైలు ప్రవీణ్‌రెడ్డి, శంకర్, పోచయ్య, ఎఎస్ఐలు సంగమేశ్వర్, చంద్రమోహన్‌ల ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేశారు.

## మహిళలకు టైలరింగ్ శిక్షణకు అవకాశం

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

గ్రామీణ మహిళల స్వావలంబన లక్ష్యంగా మండలంలోని తోర్నాల గ్రామంలో జల్‌జీవన్ మిషన్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ సహకా రంతో మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు గ్రామసర్పంచి చొప్పరి రాము తెలిపారు. గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈకార్యక్రమం ద్వారా మహిళలకు 30 రోజుల పాటు ఉచిత టైలరింగ్ శిక్షణ అందించనున్నారని, శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్ అందజేస్తారని, అలాగే శిక్షణ అనంతరం టైలరింగ్ మిషన్‌ను సబ్సిడీతో అందించను న్నట్లు వివరించారు. మిషన్ అసలుధర రూ.15,000 కాగా, అందులో రూ.7,500ను సబ్సిడీగా అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని తోర్నాలగ్రామ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి చొప్పరి రాము కోరారు. వివరాలకు 9704358862, 9010954768 నంబర్లను సంప్రతించాలని తెలిపారు.

# నర్సాపూర్‌లో ఒక్కటైన కాంగ్రెస్, బిజెపి

**నర్సాపూర్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక కోసం నర్సాపూర్‌లో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఒకటయ్యాయి. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చైర్మన్ ఎంపిక కోసం ఏ పార్టీకీ సంపూర్ణ మెజారిటీ రాలేదు. కాంగ్రెస్‌కు 6 కౌన్సిలర్ అభ్యర్థులు గెలుపొందగా, టిఆర్ఎస్ నుంచి ఐదు, బిజెపి నుంచి నలుగురు కౌన్సిలర్‌లు గెలుపొందారు. ఏ పార్టీకీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక కోసం సంపూర్ణ మెజార్టీ రాకపోవడంతో మొదట బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక కోసం చర్చలు జరిపారని తెలిసింది. అయితే వారి చర్చలు విఫలం కావడంతో, కాంగ్రెస్ బిజెపి నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్ పదవి విషయంలో చర్చలు జరపగా చైర్మన్ పదవి కాంగ్రెస్‌కు ఇవ్వాలని, వైస్ చైర్మన్ పదవి బిజెపికి ఇవ్వాలని చర్చలు జరిగాయి. ఇరు పార్టీల ఒప్పందం మేరకు చర్చలు సఫలమయ్యాయి. అయితే సోమవారం చైర్మన్ పదవి కోసం ఎన్నికల జరపగా, కాంగ్రెస్ పార్టీ తరపున ఐదో వార్డ్ కౌన్సిలర్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్ పోటీలో నిలువగా, పదిమంది కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో చైర్మన్‌గా మాచునూరి లక్ష్మీరాజు యాదవ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా వైస్ చైర్మన్ కోసం 13వ వార్డు కౌన్సిలర్ బుచ్చేష్‌యదవ్, 15వ వార్డు కౌన్సిలర్ పంబల్ల లలితబిక్షపతి పోటీలో నిలువగా, బిజెపి కౌన్సిలర్ బుచ్చేష్‌యదవ్‌కు 10 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. బిఆర్ఎస్ కౌన్సిలర్ పంబల్ల లలితకు 6 మంది మద్దతు తెలపడంతో ఈ ఎన్నికల్లో ఎక్కువమంది కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్‌కు మద్దతు తెలుపడంతో బుచ్చేష్ యాదవ్‌ను వైస్ చైర్మన్‌గా అధికారులు ప్రకటించారు. అయితే నర్సాపూర్‌లో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల విషయంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఒకటికావడంతో నర్సాపూర్‌లో ఇది చర్చనీయాంశంగా మారింది.

## వార్డు ప్రజలకు రుణపడి ఉంటాను



మాట్లాడుతున్న కౌన్సిలర్ ఉమారాణి

**సదాశివపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

14వ వార్డు నుండి బిజెపి అభ్యర్థిగా పోటీచేసిన నన్ను కులమతాలకు సంబంధంలేకుండా రక్తబంధం కంటే ఎక్కువగా ఆదరించి నా వార్డులోని అక్కాచెల్లెళ్లు, ఆత్మీయులు నాకు ఓటువేసి గెలిపించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని కౌన్సిలర్ ఉమారాణి నాగరాజు అన్నారు. మీరందరూ ఇప్పుడు నాకు బాధ్యత పెంచారని మన వార్డులోని సమస్యలను ఇచ్చినమాట ప్రకారం నెరవేరుస్తానని అన్నారు.

## ఉచిత మెగా పశువైద్య శిబిరం



ఉచిత పశువైద్య శిబిరం దృశ్యం

**ధూళిమిట్ట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండలంలోని తోర్నాల గ్రామంలో సోమవారం పశువైద్య, పశు సంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశువైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమాన్ని గ్రామసర్పంచి చొప్పరి రాము, ఉపసర్పంచి ఆకుల లలిత ప్రారంభించి పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అభివృద్ధిచెందాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎండి.సాజిత్, నితిన్, పాడిరైతులు, గోపాల మిత్ర సూపర్వైజర్ సాదుల్ల, గోపాలమిత్రలు రాములు, ఆంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్నకు బోనాల ఊరేగింపు



ఘనంగా మల్లన్నకు బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

**వెల్దుర్తి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

మండలంలోని శెరీలా గ్రామంలో యాదవ కులస్థుల కులదైవమైన మల్లన్నజాతరను యాదవసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మల్లన్నస్వామికి మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అలాగే అగ్నిగుండం. కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరిసరప్రాంత ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని మల్లన్నస్వామికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఆ మొక్కులను తీసుకున్నారు. అలాగే ఒగ్గుకథ కాలక్షేపాన్ని నిర్వహించారు.

## కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గం



రామాయంపేట మున్సిపల్ నూతన పాలకవర్గం సభ్యులు

**రామాయంపేట, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

రామాయంపేట మున్సిపాలిటీ రెండవ పాలకమండలి సోమవారం కొలువుదీరింది. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ఇంచార్జి ప్రొసీడింగ్ అధికారి, తూప్రాన్ ఆర్డీవో జైచంద్రారెడ్డి నూతనంగా ఎన్నికైన 12 మంది వార్డు కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించగా, కాంగ్రెస్‌పార్టీ నుండి 8మంది కౌన్సిలర్‌లు ఎన్నికకావడంతో చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా చైర్మన్‌గా 1వ వార్డునుండి గెలుపొందిన గజవాడ లావణ్యను, 4వ వార్డునుండి గెలుపొందిన భైరం స్వప్న ప్రతిపాదించగా, 9వ వార్డునుండి గెలుపొందిన దేవుని రంజిత్ బలపరిచారు. మరోపేరు ప్రతిపాదనకు రాకపోవడంతో గజవాడ లావణ్యను చైర్మన్‌గా ప్రకటించారు. అనంతరం వైస్‌చైర్మన్‌గా 12వ వార్డు నుండి గెలుపొందిన పోచమ్మల నవనీతను, 11వ వార్డునుండి గెలుపొందిన దాకి శ్యామల ప్రతిపాదించగా, 7వ వార్డునుండి గెలుపొందిన గజవాడ నాగరాజు బలపరిచారు. పోటీకి మరోపేరు ఎవరు కూడా ప్రతిపాదించకపోవడంతో అధికారులు పోచమ్మల నవనీతను వైస్‌చైర్మన్‌గా ప్రకటించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య (కాంగ్రెస్), వైస్‌చైర్మన్ పోచమ్మల నవనీత(కాంగ్రెస్) వార్డుసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ సాయిబాబా, మున్సిపల్ మేనేజర్ రఘువరన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## శ్రీభక్తమార్కండేయ ఆలయ వార్షికోత్సవ పాంప్లెట్ ఆవిష్కరణ



పాంప్లెట్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ పట్టణం వెంకటాపూర్ చౌరస్తాలోగల శ్రీభక్త మార్కండేయ ఆలయం మొదటివార్షికోత్సవ పాంప్లెట్ ఆలయకమిటీ సభ్యులు, బాధ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఫిబ్రవరి 23వ తేదీ సోమవారం నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని చంద్రమోళీశ్వర బ్రహ్మసూత్రలింగాన్ని దర్శించుకోవాలని చెప్పారు. కార్యక్రమాలను వేద పండితులు బ్రహ్మశ్రీ గురురాజుశర్మ, వారి శిష్యబృందం ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం, సాయంత్రం నాలుగుగంటలకు దత్తాత్రేయ ఆలయం నుండి శ్రీభక్తమార్కండేయ ఆలయం వరకు ఊరేగింపు, మహిళల కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మాధవానందసరస్వతి స్వామీజీ, వైరాగ్యశిఖామణి అవధూతమహారాజ్, సంగ్రామ్‌మహారాజ్, కరణ్ గజేంద్రభారతి మహారాజుల దివ్యప్రవచనాలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశామన్నారు.